## ధనుష్ x నయనతార

- తెలుగువారిపై..
నీకు మనస్సాక్షి ఉందా ధనుష్
- భగ్గుమన్న నయనతార.. మూడుపేజీల లేఖ
- అసలేంటీ వివాదం?

04



## నటి కస్తూరి అరెస్ట్

- తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటి
- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

02



## కీలక నిర్ణయం తీసుకున్న రేవంత్

- గద్దర్ కూతురుకు కీలక పదవి
- సాంస్కృతిక సారధి ఛైర్మన్‌గా వెన్నెల నియామకం

02



ANN తెలుగు

Follow: @ANNTELUGU

17-11-2024

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 304 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM



**కంది రామచంద్రారెడ్డి**

**వీకెండ్ అనాలసిస్**

మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తెలంగాణలో సంచలన మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. ఏడాది పాలన పూర్తిచేసుకున్న తర్వాత రేవంత్ రెడ్డి పనితీరు భిన్నంగా ఉండే అవకాశముంది. జనవరి నుండి మరింత పట్టుబిగించి పాలనను పరుగులు పెట్టించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మక ప్రచారం మెరుగుపరుచుకోవాల్సి ఉండగా, బిఆర్ఎస్, బిజెపి సోషల్ మీడియా దూకుడు పెరిగింది. ఎపి రాజకీయాలకు వస్తే చంద్రబాబు పాలన గత టర్మ్‌కు భిన్నంగా సాగుతోంది. కేంద్రంపై చిక్కిన పట్టును చంద్రబాబు సద్వినియోగం చేసుకుంటున్నాడు. బిజెపియేతర ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర ఉన్న బిజెపి మహా ఫలితాల తర్వాత సౌత్ లో ఎలాంటి రాజకీయ వ్యూహాలు అమలుచేస్తుందో చూడాలి.

ఎడిటోరియల్ పేజీ 4లో



# బీజేపీ మూసీ నిద్ర

### తులసీరాం నగర్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బస

### 21 ప్రాంతాల్లో.. 21 మంది నేతలు

### రేవంత్ ఛాలెంజ్‌ను స్వీకరించిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర రాజకియాల్లో మూసీ యుద్ధం మరో స్థాయికి చేరింది. మూసీని పునరుజ్జీవింప చేస్తామంటూ రేవంత్ సర్కార్ చెబుతుంటే సరేనంటూనే పేదల జోలికి వస్తే సహించేది లేదని విపక్షాలు హెచ్చరిస్తున్నాయి. అంతేకాకుండా పేదల పక్షాన నిలిచి వారిలో భరోసా నింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో మూసీపై అధికార విపక్ష పార్టీల మధ్య సవాళ్ళ పర్వం గత కొన్నాళ్ళుగా కొనసాగుతోంది. హైదరాబాద్ నగరానికి కాలుష్య కాసారంగా మారిన మూసీని ప్రక్షాళన చేయాల్సిందేనని, పేదల ఇళ్ళను కూల్చకుండా మూసీని ప్రక్షాళన చేయాలంటూ బీజేపీ మూసీ నిద్ర కార్యక్రమాన్ని చేపట్టింది. మూసీ ప్రక్షాళన సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టి, మూసీ సుందరికరణ అంటే చూస్తూ ఊరుకోమని బీజేపీ హెచ్చరించింది.

మిగతా 2లో





## మహా ప్రచారంలో

# రేవంత్ జోరు

### రాజురా, డిగ్రాస్, వార్ధా నియోజకవర్గాల్లో సీఎం ప్రచారం

షిండే.. అజిత్ పవార్‌లు గుజరాత్ గులామ్‌లు.. మహారాష్ట్రలో ప్రజాతీర్పు కాలరాశారు

మహా వికాస్ అగాఢీతోనే మహా వికాసం

హైదరాబాద్‌లో మరో అన్నగా నేను అండగా ఉంటా.. మార్పుకు ఓటేయండి

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం సుడిగాలి పర్యటనలు

వివరాలు 2లో

### నేనిచ్చిన ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేస్తున్న

## సంగతి తెలియదు : జైపాల్ యాదవ్



**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ విషయంలో పోలీసులు ఎప్పుడు విచారణకు పిలిచినా సహకరిస్తానని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు దాదాపు రెండు గంటల పాటు జైపాల్‌యాదవ్‌ను విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు జైపాల్ యాదవ్ తెలిపారు. తిరుపతన్న తమ సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఓ కుటుంబ వివాదాన్ని పరిష్కరించే సమయంలో ఇద్దరు కలిసినట్లు పేర్కొన్నారు. తాను ఇచ్చిన రెండు ఫోన్ నెంబర్లను తిరుపతన్న ట్యాపింగ్ చేసినట్లు పోలీసులు వివరణ కోరారని వారు కొన్ని ఆధారాలు ముందు పెట్టి విచారణ చేశారని వివరించారు.

## కృష్ణయ్యకు తెలంగాణ

# టీడీపీ పగ్గాలు ?

- చంద్రబాబుతో పలుమార్లు మంతనాలు
- పోయిన చోటే వెతుక్కునే వ్యూహం



**హైదరాబాద్, మహా:** బీసీ ఉద్యమ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు, వైసీపీ మాజీ నాయకుడు ఆర్. కృష్ణయ్య రేపోమాపో.. టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకురెడీ అయ్యారని వినబడుతోంది. ఇప్పటికే రెండు దఫాలుగా ఆయనతో చంద్రబాబు రహస్య చర్చలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

మిగతా 2లో



## బీఆర్ఎస్ చాప్టర్ క్లోజ్

- రాష్ట్రంలో ప్రతిపక్షనాయకుడు లేడు
- కిషన్ రెడ్డి ఒక్కరోజు నిద్రచేస్తే ఏమొస్తుంది?
- వరంగల్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- వరంగల్ విజయోత్సవ సభకు 'ఇందిరా మహిళా శక్తి సభ'గా నామకరణం

02

## అజ్ఞాతమా?

# అస్త్ర సన్యాసమా?

### కవిత వ్యూహంపై సర్వత్రా చర్చ



- తండ్రిలాగే కూతురు.. సర్కారుపై అన్న కేటీఆర్, బావ హరీష్‌ల పోరు
- అక్క కోసం తమ్ముళ్ల ఎదురుచూపులు
- జాగృతి ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించిన కవిత
- ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కవిత
- బెయిల్ పై బయటికొచ్చాక రాజకీయ వైరాగ్యం

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. ఒకప్పుడు నిజామాబాద్ గులాబీ సైన్యాన్నే కాకుండా తెలంగాణ జాగృతి ని ముందుండి నడిపిన కవిత లిక్కర్ కేసులో అరెస్టయి బెయిల్ పై వచ్చాక మౌనముద్ర దాల్చారు. తండ్రి కేసీఆర్ లా వ్యూహంతో అజ్ఞాతంలో ఉన్నారా? వైరాగ్యం తో రాజకీయాల నుండి అస్త్రసన్యాసం చేశారా? అన్న ప్రశ్న అనుచరులను, అభిమానులను తొలుస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లిన కవిత, ఆ తరువాత జైలు నుంచి విడుదలయ్యారు.

మిగతా 2లో



## మూడు దేశాల టూర్‌కు ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ శనివారం సాయంత్రం మూడు దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో జీ 20 సదస్సు జరిగే బ్రెజిల్‌తో పాటు భాగంగా నైజీరియా,గ్వామ్ దేశాల్లో మోడీ పర్యటించనున్నారు. ఐదు రోజులపాటు మోదీ మూడు దేశాల్లో పర్యటిస్తారు. భారత్‌తో ఆయా దేశాల బంధాన్ని బలపరిచే దిశగా ప్రధాని ఈ పర్యటన సాగనుంది. పర్యటనలో భాగంగా మోదీ పలువురు దేశాధినేతలతో పాటు ఆయా దేశాల్లోని ప్రవాస భారతీయులను కలుస్తారు.


## శివాజీ మహారాజ్‌లా పవన్ కళ్యాణ్



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్రలోనూ క్రేజ్ సంపాదించుకున్నాడు. పవన్ నాందేడ్ లో ప్రసగించినప్పుడు మరాఠీలో మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ను , ఆయన తల్లి జిజియా బాయిని గుర్తు చేసుకున్నారు. అదే విధంగా బాబా సాహేబ్ అంబేద్కర్, బాల్ థాకరే గారిని స్మరించుకున్నారు. పవన్ కళ్యాణ్ మహారాష్ట్రలో అక్కడి వాళ్లలాగా పగిడిసైతం వేసుకున్నారు. దేశంలో కోసం మోడీసర్కారు పదేళ్లలో ఏంచేసిందో వివరించే ప్రయత్నంచేశారు. ఆర్టికల్ 370 నుంచి అయోధ్య రామమందిరం వంటి అనేక క్లిష్టమైన సమస్యల్ని మోదీ సరిదిద్దారన్నారు. అంతే కాకుండా.. ఎన్డీయే దేశంకోసం అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించారు. - మహా

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

### ఐదుగురు మావోయిస్టులు మృతి



**మహా:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. యాంటీనక్సలైట్ ఆపరేషన్లో ఉన్న భద్రతా బలగాలకు శనివారం ఉదయం 8 గంటల సమయంలో నారాయణపుర్‌లోని అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఎదురుపడ్డారు. జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే స్పందించిన భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. దీంతో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి మవోయిస్టుల మృతదేహాలు, భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన సైనికులను రాయ్పుర్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. జవాన్లకు మెరుగైన చికిత్స అందించడం కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు బస్తర్ రేంజ్ ఐజీ పీ సుందర్‌రాజ్ వెల్లడించారు.

# మహా ప్రచారంలో రేవంత్ జోరు





**మహా, చంద్రాపూర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తు న్నారు. రాజురా, డిగ్రాస్, వార్దా నియోజకవర్గాల్లో ప్రచార సభలు, రోడ్ షోలలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు. ఏడాది కాలంలో తెలంగాణలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చామని ధీమా వ్యక్తం చేశారు. ఈ దేశంలో గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ ఏడాది కాలంలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మహారాష్ట్రలో ప్రజా తీర్పును ఏక్ నాథ్ షిండే .. అజిత్ పవార్ కాలరాశారని మండిపడ్డారు. షిండే.. అజిత్ పవార్ గుజరాత్ గులాంలుగా మారారని తీవ్ర విమర్శలు చేశారు. చంద్రాపూర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి ప్రవీణ్ పడ్ వేకర్‌ను 50 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. డిగ్రాస్ లో మాణిక్ రావు ఠాక్రేను గెలిపించాలని కోరారు. ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రవీణ్‌ను గెలిపిస్తే మీకు ఇక్కడ ఒక అన్న ఉంటారు.. హైదరాబాద్‌లో మరో అన్నగా నేను ఉంటా.. అంటూ వెల్లడించారు. మాణిక్ రావు ఠాక్రే నియోజకవర్గంలో పలువురు కూటమి నేతల ఇళ్ళకు సీఎం వెళ్ళి భరోసానిచ్చారు. సీఎంతో పాటు ఎంపీ మల్లురవి, కాంగ్రెస్ నేతలు మేఘారెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రాజూరులో ఎంపీ చామలకిరణ్ కుమార్ రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. మహారాష్ట్రలో రేవంత్ ప్రచారానికి భారీ స్పందన కనిపిస్తుండగా, తెలంగాణ నేతలు ఇన్ ఛార్జిలుగా ఉన్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని బంపర్ మెజారిటీతో గెలిపించాలని సూచించారు.



2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే

## సిద్ధమవుతున్నాం

### ఏపీ సీఎం చంద్రబాబు

**ఢిల్లీ, మహా:** ప్రధాని మోడీ తమ నాయకుడని, ఆయన నాయకత్వంలో తామంతా ముందుకు సాగుతామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న హిందుస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత నెలలో హర్యానా సీఎం ప్రమాణస్వీకారం జరిగిన తర్వాత ఎన్డీయే కూటమి సీఎంలతో మోడీ భేటీ అయ్యారని... ఆ సమావేశం నాలుగు గంటల సేపు కొనసాగిందని చంద్రబాబు తెలిపారు. 2029 ఎన్నికలకు ఏ విధంగా సమాయత్తం కావాలని ఆ సమావేశంలో మోడీ అందరి అభిప్రాయాలను తీసుకున్నారని చెప్పారు. ఏపీలో 2029 ఎన్నికల కోసం తాము ఇప్పటి నుంచే సమాయత్తమవుతున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత వచ్చిందని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా పవన్ కల్యాణ్ టీడీపీ, జనసేన, బీజేపీలను కలిపారని చెప్పారు. దాని ఫలితాన్ని ఎన్నికల్లో మనం చూశామని అన్నారు. ఏపీ ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వస్తాయని తాము ముందుగానే ఊహించామని చెప్పారు.

# బీజేపీ మూసీ నిద్ర

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర ప్రణాళిక లేకుండానే, మూసీ సుందరీకరణకు ఎంత వ్యవమవుతుందన్నది తేలకుండానే పేదల ఇళ్ళను ఖాళీ చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం కావడం పట్ల కమలం పార్టీ కన్నెర్ర చేస్తోంది. మూసీ బాధితులకు అండగా నిలిచేందుకు సన్నద్ధమైంది.

**ప్రజల్లో మనోధైర్యం నింపేందుకే మూసీ నిద్ర..**

మూసీ సుందరీకరణ విషయంలో బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ను స్వీకరించిన పార్టీ మూసీ నిద్రకు ఉపక్రమించింది. సీఎం సవాల్ ను స్వీకరించిన బీజేపీ మూసీ పరివాహక ప్రాంతంలో ఒక రోజు నిద్రకు శ్రీకారం చుట్టడంతో పాటు పరివాహక ప్రాంతాల ప్రజల్లో మనోధైర్యం నింపేందుకు ప్రయత్నిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని వారిలో నెలకొన్న భయాన్ని తొలగించడంతో పాటు వారికి పూర్తి అండగా ఉంటామన్న నమ్మకాన్ని కల్పించేందుకు బీజేపీ నేతలు వేర్వేరు ప్రాంతాలలో ఒక రోజు నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. నిద్ర కార్యక్రమానికి ముందు నేతలు ఆయా ప్రాంతాలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. అంబర్ పేటలోని తులసీరాంనగర్ ప్రాంతంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, ఓల్డ్ మలక్ పేట శాలివాహన నగర్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె లక్ష్మణ్, హైదర్ షా కోట్ లో చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎల్ బీ నగర్ లోని ఫణిగిరినగర్ లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రామంతాపూర్ లో మాజీ ఎమ్మెల్యే ఎన్ వీ ఎస్ఎస్ ప్రభాకర్, అత్తాపూర్ లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, హైదర్ గూడలోని జనార్దన్ రెడ్డి, అంబర్ పేటలోని అంబేద్కర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే సి. కృష్ణాయాదవ్, శాస్త్రీ నగర్ లో మాజీ కెఎస్ రత్నం, కమలానగర్ లో చింతల రామచంద్రారెడ్డి, పురానాపూల్ దర్వాజలో అమర్ సింగ్ ఖిలావత్, గౌలిగూడలో ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, జుమ్మేరాత్ బజార్ లో మాజీ ఎంపీ సీతారాంనాయక్, అఫ్జల్ గంజ్ లో మాజీ ఎంపీ బీవీ పాటిల్, బహదూర్ పుర అసద్ బాబా నగర్ లో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, జియాగూడలో మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ, కార్వాన్ లో మాజీ ఎమ్మెల్యే ప్రేంసింగ్ రాథోడ్, నంగర్ హౌజ్ లో పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్గ్యాల ప్రదీప్ కుమార్ లు నిద్ర చేశారు.

తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన


# నటి కస్తూరి అరెస్ట్

**హైదరాబాద్, మహా :** తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కన్నడ నటి కస్తూరిని పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ లో కస్తూరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 3న చైన్నైలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన నటి.. '300 సంవత్సరాల కిందట ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు వచ్చిన తెలుగు వారు.. ప్రస్తుతం మాది తమిళ జాతి అంటున్నారన్నారు. ఎప్పుడో ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణులను తమిళులు కాదని చెప్పేందుకు మీరెవరు' అంటూ ద్రవిడ సిద్ధాంత వాదులపై ఆమె మండిపడ్డారు. 'ఇతరుల ఆస్తులను లూటీ చేయొద్దని, ఇతరుల భార్యలపై మోజుపడొద్దని, ఒకరికంటే ఎక్కువ మంది భార్యలను చేసుకోవద్దని బ్రాహ్మణులు చెబుతుండడంతోనే తమిళనాడులో వారికి వ్యతిరేకంగా ప్రచారం జరుగుతోందని' విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, అటు తమిళనాడులోనూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. వివాదం ముదురుతుందని గ్రహించిన కస్తూరి బహిరంగ క్షమాపణలు చెప్పారు. అయితే నటి వ్యాఖ్యలపై మహాజన సంఘం రాష్ట్ర సభ్యుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా అప్పటి నుంచి కస్తూరి పరారీలో ఉన్నారు. ముందస్తు బెయిల్ కోసం మద్రాస్ హైకోర్టు ఆశ్రయించగా.. ఆ పిటిషన్ను ఏకసభ్య ధర్మాసనం కొట్టివేసింది. తాజాగా హైదరాబాద్ లో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.



## కీలక నిర్ణయం తీసుకున్న రేవంత్

- గద్దర్ కూతురుకు కీలక పదవి
- సాంస్కృతిక సారధి ఛైర్మన్ గా వెన్నెల నియామకం



ABSTRACT

YAT & C (CA) Department - Appointment of Dr. Gummadi V. Venela as Chairperson, Telangana Samskruthika Sarathi - Orders - Issued.

YOUTH ADVANCEMENT TOURISM AND CULTURE (CA) DEPARTMENT

G.O.Rt.No. 328 Dated: 16-11-2024

Read the following:-

1. G.O.Ms.No. 6, YAT & C (CA) Department, Dated: 27-11-2014.
2. G.O.Ms.No. 198, General Administration (General, L&C) Department, Dated: 05-09-2024.

ORDER:

In the reference 1st read above, Government have issued orders, creating a separate State Level Body called "Telangana Samskruthika Sarathi" to disseminate information on different Government flagship programmes, policies and schemes and also to create awareness and a sense of pride among the people about the unique cultural identify of Telangana.

2. Government after careful examination hereby appoint Dr. Gummadi V. Venela as Chairperson, Telangana Samskruthika Sarathi with immediate effect.

3. The pay, allowances, staff and other terms and conditions in respect of appointment of chairperson shall be as per the orders issued vide reference 2nd read above.

4. The Director, Department of Culture, Telangana, Hyderabad is directed to take necessary action accordingly and report compliance to the Government.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

N. SRIDHAR
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
Sri Dr. Gummadi V. Venela, Chairperson, Telangana Samskruthika Sarathi, Hyderabad (through DOC).
The Director, Department of Culture, Telangana, Hyderabad.
Copy to:
The Officer on Special Duty to Chief Minister (VS).
The PS to Hon'ble Minister (TBC).
The PS to Chief Secretary to Government.
The PS to Principal Secretary to Government, YAT & C Department.
The General Administration (General, L&C) Department.
The Finance (EBS-I) Department.
SF/SCs.
//FORWARDED::BY ORDER//

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యమ గొంతుకలకు ఊతంగా నిలిచే 'తెలంగాణ సాంస్కృతిక సారధి'కి ఛైర్ పర్సన్ గా ప్రజా యుద్ధ నౌక, దివంగత గద్దర్ కూతురు డాక్టర్ గుమ్మడి వి. వెన్నెల ను నియమించింది. ఈ మేరకు యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు, వర్క్ షాపులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారధి కళాకారులతో ప్రచారం చేయిస్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఈ సంస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గతంలో ఛైర్మన్ గా అప్పటి మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ను నియమించింది. ఇక 2023 సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గద్దర్ కూతురు వెన్నెల ఓటమి పాలైన విషయం తెలిసిందే. ఉప ఎన్నికల్లో వెన్నెలకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన నారాయణ్ శ్రీగణేష్ కు కేటాయించి గెలిపించారు. తాజాగా ప్రభుత్వం ఆమెకు ఛైర్ పర్సన్ గా కీలక బాధ్యతలు అప్పగించారు.

## అజ్ఞాతమా?

# అస్త్ర సన్యాసమా?

(మొదటి పేజీ తరువాయి)

ఆమె జైలు నుంచి విడుదలై రెండున్నర మాసాలవుతున్నా గతంలో మాదిరిగా కవిత పార్టీ కార్యక్రమాల్లో గానీ, ఇతర కార్రమాల్లో గానీ ఎక్కడా కూడా కనిపించడంలేదు. కేవలం ఆమె ఇంటికే పరిమితమయ్యారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, అటు జాగృతి కార్యకర్తలు కలవరానికి గురవుతున్నారు. జైలు నుంచి విడుదలైన తరువాత కవిత పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని తన ప్రభావాన్ని చూపిస్తారని అంతా అనుకున్నారు. కానీ, అందుకు భిన్నంగా పరిస్థితి ఉండడంతో కొంత ఆలోచనలో ఉన్నారు. అరెస్ట్ కాకముందు కవిత ఎప్పుడూ చూసినా బిజీ బిజీగా కనిపించేవారు. పార్టీ కార్యక్రమాలు గానీ, జాగృతి కార్యక్రమాలు గానీ, ప్రభుత్వ కార్యక్రమాలు గానీ, బతుకమ్మ వేడుకలు గానీ... ఇలా ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటూ నిత్యం బిజీ బిజీగా ఉండేవారు. రాజకీయంలోకి రాకముందు కవిత తెలంగాణ ఉద్యంలో పాల్గొన్న సమయంలో కవితకు మంచి గుర్తింపు దక్కింది. తెలంగాణ మహిళల పండుగ అయిన బతుకమ్మ పండుగకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తుల్లో ఈమె ఒకరు. జాగృతి పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసి, దాని ద్వారా బతుకమ్మ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ విశేషాలు ప్రజలకు ఎక్కువగా తెలిసేలా తన వంతు కృషి చేశారు. దీంతో ఆమెకు జనాల్లో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఓ వైపు కేసీఆర్ కూతరుగా.. మరోవైపు తన వాక్చాతుర్యంతో ప్రజల్లో గుర్తింపు వచ్చింది. ఆ తరువాత రాజకీయాల్లోకి వచ్చి ఎంపీగా పని చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల విమర్శలను తనదైన స్టైల్ లో విమర్శించేవారు. ఇలా కూడా కవితకు గుర్తింపు వచ్చింది. ఇలా ఎప్పుడు చూసినా బిజీ బిజీగా ఉండే కవిత ఎందుకు స్తబ్ధుగా ఉన్నారు. ఎప్పుడు చూసినా వార్తల్లో ఆమె పేరు వినిపించేది. కానీ, ఇప్పుడు ఆమె పేరు కనిపించడంలేదని, జైలు నుంచి బయటకు వచ్చాక కవితకు ఏమైంది..? ఎందుకు బయటకు వస్తలేరంటూ వారు ఆలోచనలు చేస్తున్నారు.



జైలు నుంచి విడుదలైన సందర్భంగా కవిత శపథం చేశారు. తనని ఆ కేసులో కొంతమంది కావాలనే ఇరికిరించారని, వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలబోనని అన్నారు. చివరకు న్యాయమే గెలుస్తుందంటూ ఆమె పేర్కొన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, జాగృతి కార్యకర్తలు, ఆమె అనుచరులు అంతా అనుకున్నారు ఇక నుంచి కవిత పెద్ద ఎత్తున గళం విప్పబోతున్నారని అనుకున్నారు. తన వాక్చాతుర్యంతో అటు కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం కురిపిస్తారనుకున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఆమె తనదైన శైలిలో పార్టీకి మద్దతుగా గొంతు ఎత్తుతారని అనుకున్నారు. కానీ, అటువంటి పరిస్థితి లేకపోవడంతో వారంతా ప్రస్తుతం ఆశ్చర్యపోతున్నారు. అసలు కవిత ఎందుకు ఇంటి నుంచి బయటకు రావడంలేదో తెలుసుకునేందుకు ఆరా తీస్తున్నారంటా. ఓ వైపు తన అన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మరోవైపు మాజీమంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు పోరాడుతున్నారు. ఎక్కడ అవకాశం దొరికినా తమ వాణిని వినిపిస్తున్నారు. కానీ, జైలు నుంచి వచ్చి ఇన్ని రోజులవుతున్నా ఎందుకు కవిత బయటకు రావడంలేదని ఆరా తీస్తున్నారు. ఎంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారనుకుంటే ఎందుకు సైలెంట్ అయ్యారని అంతా చర్చించుకుంటున్నారు.

ఓవైపు కేటీఆర్, మరోవైపు హరీశ్ రావు నిత్యం జనాల్లోనే ఉంటున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల నుంచి పిలుపు వచ్చిన వెంటనే అక్కడ వాలిపోతున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వంపై తమదైన స్టైల్ లో విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకున పెట్టే ప్రసంగాలు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం వారి పేర్లు జనాల నోట్లో ఆడుతున్నాయి. పలువురు బీఆర్ఎస్ నేతలు కూడా అవకాశం ఉన్న ప్రతిసారి గళం విప్పుతూ జనాల్లోనే ఉంటున్నారు. మహిళా నేతలు కూడా ప్రభుత్వంపై అటు అసెంబ్లీలో ప్రశ్నల వర్షం కురిపించారు. సందర్భం వచ్చిన ప్రతిసారి జనాల వద్దకు వెళ్లి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నో సందర్భాల్లో కూడా మీడియాతో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నారు. అయితే, వీరంతా నిత్యం జనాలతో ఉంటూ గళం విప్పుతుంటే ఇటు కేసీఆర్, అటు కవిత మాత్రం ఇంటి నుంచి బయటకు రావడంలేదు. ఎందుకు వీళ్లిద్దరు ఇళ్ల నుంచి బయటకు రావడంలేదనేది తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు.

కవిత జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత ఢిల్లీలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఆ తరువాత ఎర్రవల్లికి వెళ్లి తన తండ్రిని కలిశారు. ఆ తరువాత మరో రెండు సందర్భాల్లో కవిత కనిపించారు. ఈ సందర్భాల్లో తప్ప మరెప్పుడూ ఆమె కనిపించలేదు. ఆమె వాయిస్ వినిపించలేదు. ఇటు సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ తెగ యాక్టీవ్ గా ఉండే ఆమె చాలా సైలెంటైపోయారు. దీంతో కవిత ఎక్కడా అంటూ నెట్టింటా కామెంట్స్ వస్తున్నాయి. అటు దసరా పండుగప్పుడు నిర్వహించే బతుకమ్మ సంబరాల్లో కవిత పేరు బాగా వినిపించేది. బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొనేవారు. కానీ, ఈసారి మాత్రం కవిత బతుకమ్మ వేడుకల్లో కనిపించలేదు. ఈ క్రమంలోనే కవిత ఎందుకు ఇంటి నుంచి బయటకు రావడంలేదు? అని, సైలెంట్ గా ఉండి ప్రభుత్వాలపై పోరాడేందుకు ప్రత్యేక ప్రణాళికలు ఏమైనా రచిస్తున్నారా? అని ప్రజలు ఆలోచిస్తున్నారంటా. కేసీఆర్, కవితతోపాటు పలువురు నేతలు సైలెంట్ గా ఉండడంతో కేడర్ కొంత నిరుత్సాహానికి గురవుతున్నారంటా.

కృష్ణయ్యకు తెలంగాణ

# టీడీపీ పగ్గాలు ?

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌కు వెళ్లిన ప్రతిసారీ.. ఆర్. కృష్ణయ్యతో మంతనాలు సాగించారని సమాచారం. ఈ క్రమంలో రెండు సార్లు కృష్ణయ్య నేరుగా చంద్రబాబుతో భేటీ అయ్యారనికూడా తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలోనే అంటే.. 2014 ఎన్నికల సమయంలోనే కృష్ణయ్య టీడీపీలో ఉన్నారు. అప్పటి ఎన్నికల్లో ఆయన ఎల్‌బీ నగర్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేశారు. అంతేకాదు.. అప్పటి ఎన్నికల్లో టీడీపీ విజయం దక్కించుకుని ఉంటే.. ఆయనే ముఖ్యమంత్రి కూడా అయ్యేవారు. ఈ విషయాన్ని చంద్రబాబే అప్పట్లో స్వయంగా ప్రకటించారు. అయితే.. ఆయన పరాజయం పాలవడం.. తర్వాత.. వైసీపీ కి చేరువ కావడం తెలిసిందే. ఈ క్రమంలోనే 2021లో జగన్.. కృష్ణయ్యను ఏరికోరి బీసీ కోటాలో రాజ్యసభకు పంపించారు. కొన్నాళ్ల కిందటి వరకు కూడా ఆయన వైసీపీలోనే ఉన్నారు. అయితే.. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించిన తర్వాత నుంచి రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయి.. కృష్ణయ్య యూటర్న్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన తిరిగి సైకిల్ ఎక్కేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనికి చంద్రబాబు కూ డా సమ్మతించినట్టు తాజాగా వెలుగు చూస్తున్న సమాచారం. ప్రస్తుతం.. తెలంగాణలో టీడీపీని బలోపే తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగానే కృష్ణయ్యకు ఏకంగా.. తెలంగాణ టీడీపీ పగ్గాలు అప్పగిస్తారని.. ఈమేరకు చర్చలు కూడా పూర్తయ్యాయన్నది సమాచారం. బీసీ నేతకు పగ్గాలు అప్పగించడం ద్వారా తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలన్నది చంద్రబాబు ఉద్దేశంగా ఉంది. గతంలో కూడా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు పగ్గాలు అప్పగించారు. అయితే.. ఆయన బీఆర్ ఎస్ పంచన చేరిపోయారు. ఇప్పుడు మరోసారి కీలకనేతగా ఉన్న కృష్ణయ్యవైపు చంద్రబాబు చూస్తున్నట్టు సమాచారం. మరికొద్దిరోజుల్లోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

# బీఆర్‌ఎస్ చాప్లర్ క్లోజ్

**వరంగల్, మహా :** తెలంగాణలో బీఆర్ఎస్ కు నూకలు చెల్లాయని , రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర లేకుండా పోయిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తాజాగా ఆయన వరంగల్ పర్యటించారు. ప్రజా పాలన విజయోత్సవ సభ నేపథ్యంలో సభపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. ''సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించడంలో బీఆర్ ఎస్ పూర్తిగా విఫలమైంది. అధికారం కోల్పోయామనే అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్ఎస్ ఉండదు. పదేళ్లలో బిఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాల కన్నా ఏడాది వ్యవధిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కవ. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. మిగతా రాష్ట్రాల్లోనూ తెలంగాణ తరహా పథకాలు కావాలని అడుగుతున్నారు. కులగణనతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. సంక్షేమం, అభివృద్ధిలో భారాస నేతలతో చర్చకు సిద్ధం. అన్ని రకాలుగా ప్రజలను మెప్పించాం. అందుకే విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నాం. వరంగల్ విజయోత్సవ సభకు 'ఇందిరా మహిళా శక్తి సభ'గా నామకరణం చేశాం'' అని తెలిపారు.

**ప్రతిపక్ష నాయకుడు లేడు**

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు కేవలం ఫామ్ హౌస్ కే పరిమితమయ్యాడు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు నిరాశే మిగిల్చింది. పదేళ్ల కంటే 11 నెలల్లో మెరుగైన పాలన అందించామని తెలిపారు మహేష్ గౌడ్. ఈనెల 19న వరంగల్ లో విజయోత్సవ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభలో దాదాపు ఎత్తున మహిళలు పాల్గొనే అవకాశముంది. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర లేకుండా పోయింది అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ కు నూకలు చెల్లాయని అందుకే ఆ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రెండు దఫాలుగా నీళ్లు, నిధులు నియామకాల పేరుతో కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసగించారని తెలిపారు. కిషన్ రెడ్డి ఒక్కరోజు నిద్ర చేస్తే ఏం వస్తుందని ప్రశ్నించారు. మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



తొలిసారిగా స్పేస్ ఎక్స్‌పై ఆధారపడుతున్న

## ఇస్రో

**మహా, ఢిల్లీ:** గత కొన్నేళ్లలో అంతరిక్ష రంగంలో ఎంతో పురోగతి సాధించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో... ఆశ్చర్యకరంగా ఎలాన్ మస్క్ కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ ద్వారా ఓ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపాలని నిర్ణయించింది. ఇతర దేశాలకు చెందిన శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపిస్తూ భారీగా ఆర్జిస్తున్న ఇస్రో... ఇప్పుడు స్పేస్ ఎక్స్ ద్వారా తన శాటిలైట్ ను రోదసిలోకి పంపించడం వెనుక బలమైన కారణమే ఉంది. ఇస్రో ఇప్పటిదాకా భారీ సైజు ఉండే ఉపగ్రహాలను తన బాహుబలి రాకెట్ మార్క్3 ద్వారా రోదసిలోకి పంపిస్తోంది. అయితే మార్క్ 3 రాకెట్ 4,000 కిలోల బరువున్న శాటిలైట్లను మాత్రమే భూస్థిర బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టగలదు. ఇస్రో రూపొందించిన తాజా కమ్యూనికేషన్ శాటిలైట్ జీశాట్‌ఎన్2 బరువు 4,700 కిలోలు. ఈ కారణంతోనే ఇస్రో స్పేస్ ఎక్స్ పై ఆధారపడుతోంది. స్పేస్ ఎక్స్ కు చెందిన ఫాల్కన్9 రాకెట్ త్వరలోనే జీశాట్ ఎన్2 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి మోసుకెళ్లనుంది.

నేను మహారాష్ట్ర వచ్చింది...

# ఓట్లు అడిగేందుకు కాదు

### .. పవన్ కళ్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు

### మరాఠీలో ప్రసంగించిన జనసేనాని




**నాందేడ్, మహా:** మహారాష్ట్ర వచ్చింది ఎన్నికల కోసం కాదు అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని డెగ్లూరులో జరిగిన ఎన్నికల సభలో పవన్ కల్యాణ్ మరాఠీలో ప్రసంగించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. తొలుత జై భవానీ, జై శివాజీ, జై మహారాష్ట్ర అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. తాను మరాఠీలో ప్రసంగిస్తానని.. ఏవైనా తప్పులు ఉంటే క్షమించాలని కోరారు. ఇది ఛత్రపతి శివాజీ పరిపాలించిన భూమి, ఇది ఆయన నడిచిన నేల, ఇంతటి వీరత్వం కలిగిన గడ్డ మహారాష్ట్ర.. మరాఠా ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు అంటూ కొనసాగించారు. తాను ఇక్కడికి ఓట్లు అడిగేందుకు రాలేదని, మరాఠా వీరులకు నివాళి అర్పించడానికి వచ్చానని పవన్ తెలిపారు. మరాఠా యోధుల పోరాటాన్ని గుర్తుచేసుకోవడానికి, శివాజీ మహారాజ్ పరిపాలనను, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని గుర్తుచేసుకోవడానికి వచ్చానని వివరించారు. స్వరాజ్యం అర్థం తెలిపిన నేల, అంబేద్కర్ జన్మించిన నేలపై నివాళులు అర్పించేందుకు వచ్చానని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఎన్డీఏతో కలిసి ఉన్నాను. బాలాసాహెబ్ ఠాక్రే మరణించినప్పుడు నివాళులు అర్పించాను. శివసేన వ్యవస్థాపకుడు, హిందూ హృదయ సామ్రాట్ బాలా సాహెబ్ ఠాక్రే నుంచి ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదాన్ని నేర్చుకున్నానని తెలిపారు.

# గీత కార్మికులకు గుడ్‌న్యూస్

## ఉచితంగా మోపెడ్ వాహనాలు.. మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన

**హుస్నాబాద్, మహా :** గీత కార్మికులు రేవంత్ రెడ్డి సర్కార్ మరో గుడ్ న్యూస్ వినిపించింది. ఇప్పటికే కల్లు గీత కార్మికుల రక్షణ కోసం కాటమయ్య రక్షక కవచాలను పంపిణీ చేస్తుండగా ఇప్పుడు వారి కోసం మరో తీపి కబురు వినిపించారు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. శనివారం హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గీత కార్మికులకు.. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షక కవచాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికులు చనిపోకుండా ఉండేందుకు ఐఐటీ విద్యార్థులు రక్షక కవచాన్ని తయారు చేయగా వాటిని కాటమయ్య రక్షక కవచం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ పంపిణీ చేస్తోందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ కిట్‌పై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చే విషయంలో ఎక్కడా జాప్యం జరగకూడదని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వం ఇచ్చే నిధులతో పాటు ఎమ్మెల్యే నిధులు, పార్లమెంటు సభ్యుడి నిధులను కూడా వెచ్చించి పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. గీత కార్మికులు వృత్తిలో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ



పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని మంత్రి ఆకాంక్షించారు. తాటి చెట్లు ఎత్తుగా ఉండటం వల్ల అసౌకర్యంగా ఉండడం వాస్తవమేనని అందుకోసం చెట్లు ఎత్తు తక్కువగా ఉండేలా పరిశోధనలు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే కాలువలు, చెరువు గట్లపైనా, రోడ్ల పక్కన ఇతర ప్రాంతాల్లో నాటే చెట్లల్లో 50 శాతం తాటి, ఈత చెట్లను నాటాలని మంత్రి పొన్నం తెలిపారు. జన్మదిన సందర్భాలు, శుభకార్యాల సందర్భాల్లో ప్రతి ఒక్కరూ కనీసం 10 మొక్కలు నాటి తమ బాధ్యతను చాటుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి గానూ స్థలం ఉంటే బోర్లు వేయించే బాధ్యత కూడా తీసుకుంటానని మంత్రి కీలక ప్రకటన చేశారు. ఈ క్రమంలోనే.. గీత కార్మికులకు సంబంధించి ఏమైనా పాత బకాయిలు ఉన్నట్లయితే విడుదలయ్యేలా చూస్తానని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

తాటి, ఈత వనాలకు వెళ్లేందుకు, వచ్చేందుకు ఇబ్బందవుతుందని.. ఈ కార్యక్రమంలో ఓ గీత కార్మికుడు తమ సమస్యల గురించి మంత్రికి తెలియజేయగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు కాస్త మెరుగ్గా లేవని 2025 మార్చి తర్వాత గీత కార్మికులకు మోపెడ్ వాహనాలు అందించనున్నట్టు మంత్రి ప్రకటన చేశారు. గీత కార్మికులందరూ ప్రభుత్వం ఇచ్చే ఫలాలను సక్రమంగా సద్వినియోగం చేసుకొని ప్రాణాలు రక్షించుకుని.. మెరుగైన జీవితాలను అనుభవించాలన్నారు.

# మందుబాబు వీరంగం

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ పై వీరంగం.. పక్కకు జరగమన్న పాపానికి విచక్షణారహితంగా దాడి

### అడ్డువచ్చిన వారినీ వదలని మందుబాబు.. అదుపులోకి తీసుకున్న పోలీసులు.. రిమాండ్‌కు తరలింపు

**జరుగుమల్లి, మహా :** మద్యం తాగి ఓ వ్యక్తి ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్, మహిళా కండక్టర్‌లపై దాడికి దిగాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లాలోని జరుగుమిల్లి మండలం కామేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన కథనం ప్రకారం, ఒంగోలు నుంచి జరుగుమల్లి మండలం వర్ధినేనిపాలేనికి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలు దేరింది. టంగుటూరు, జరుగుమల్లి మార్గంలో కామేపల్లి విగ్రహాల కూడలికి చేరుకోగానే ప్రయాణికులు బస్సు దిగుతున్నారు. ఈ క్రమంలో కామేపల్లికి చెందిన పత్తిపాటి హరి బాబు అనే వ్యక్తి అప్పటికే పూటుగా మద్యం తాగి ఉన్నాడు. తాగిన మైకంలో రోడ్డుపై పలువురితో గొడవ చేస్తున్నాడు. అదే సమయంలో ప్రయాణికులు దిగిడానికి డ్రైవర్ బస్సు ఆపాడు. ప్రయాణికులు దిగిన తర్వాత కండక్టర్ సుభాషిణి డ్రైవర్‌కు రైట్ చెప్పింది. ఈ క్రమంలో హరిబాబు ఆర్టీసీ బస్సు సమీపానికి వచ్చి నిల్చున్నాడు. పక్కకు వెళ్లాలని కండక్టర్ సుభాషిణి సూచించింది. ఇంతలోనే కండక్టర్‌ను బూతులు తిడుతూ అసభ్యకరంగా





మాట్లాడాడు. అనంతరం బస్సు టైర్ కింద పడుకొని ముందుకు కదలకుండా నానా హంగామా చేశాడు. సుభాషిణిని బస్సు చుట్టూ వెంబడిస్తూ కొట్టాడు. అంతటితో ఆగకుండా రెచ్చిపోయి కాళ్లతో తన్నుతూ దుర్భాషలాడాడు. స్థానికంగా ఉన్న వారు అడ్డు చెప్పినా వినకుండా దాదాపు గంట సేపు నడి రోడ్డుపై వీరంగం సృష్టించాడు. బస్సు డ్రైవర్ దిగి వచ్చి అడ్డుకోడానికి ప్రయత్నం చేశారు. దీంతో డ్రైవర్‌పై కూడా తిరగబడి కొట్టాడు. అడ్డు వచ్చిన స్థానికులను ఇష్టా రీతిన తిడుతూ దాడి చేశాడు. కండక్టర్ సెల్ ఫోన్ తీసుకొని నేలకు కొట్టాడు. విషయం తెలుసుకున్న జరుగుమల్లి పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న హరిబాబును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించారు. గాయపడిన మహిళా కండక్టర్ సుభాషిణిని 108 వాహనంలో నెల్లూరు జిల్లా కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సింగరాయకొండ సీఐ హజరత్తయ్య తెలిపారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# ప్రేమించకపోతే ఎయిడ్స్ ఇంజెక్షన్ ఇస్తా

## యువతికి లైంగిక వేధింపులు

### పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు






**హయత్‌నగర్, మహా :** 'ప్రేమించకపోతే ఎయిడ్స్ ఇంజెక్షన్ ఇస్తా, మీ అమ్మ, నాన్నను కూడా చంపేస్తా' అంటూ ఓ ప్రేమోన్మాది స్నేహితురాలిని లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. గతకొన్ని రోజులుగా యువతిని వెంబడిస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. గతంలో తాము దిగిన ఫోటోలను మార్ఫింగ్ చేసి పరువు తీస్తానంటూ ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో అతడి ఆగడాలు తట్టుకోలేక పోయిన యువతి పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన హైదరాబాద్ హయత్‌నగర్‌లో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం నాగార్జున సాగర్ ప్రాంతానికి చెందిన చెరుకుపల్లి విజయ్, నగరానికి చెందిన ఓ యువతి స్నేహితులు. డిగ్రీ చదివే సమయంలో ఇద్దరికీ పరిచయం అయ్యింది. ఆ తర్వాత ఆమెను విజయ్ ప్రేమ పేరుతో వేధించటం మెదలు పెట్టాడు. గతంలో తాము సరదాగా కలిసి ఉన్న సమయంలో దిగిన ఫోటోలు, వీడియోలు అందరికీ చూపిస్తానంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. బస్ స్టాండ్‌లోనూ, కాలేజీ ఎదుట ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. కాలేజీ నుంచి వస్తున్న సమయంలో వెంటపడి బలవంతంగా తన బైక్ ఎక్కాలని ఒత్తిడి తెచ్చాడు. చాలా సార్లు కాలేజీలో వెంటబడి కొట్టాడని.. బంధువులందరికీ ఫోన్ చేస్తూ మీ బిడ్డని చంపుతా అని బెదిరిస్తున్నాడని యువతి వాపోయింది. తనను ప్రేమించాలని లేదంటే ఎయిడ్స్ ఇంజక్షన్ ఇచ్చి లైఫ్ లేకుండా చేస్తానని, తల్లిదండ్రులను కూడా చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయింది. గతంలో తన ఇంటికి వచ్చి తండ్రిపై దాడి చేశాడని, మరికొందరు అమ్మాయిలను కూడా ఇలాగే వేధింపులకు పాల్పడ్డాడని చెప్పింది. విజయ్ నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని వాపోయింది. ఈ మేరకు హయత్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

# ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబంలో తీవ్ర విషాదం

## సోదరుడు రామ్మూర్తి నాయుడు కన్నుమూత

### ఒక దఫా ఎమ్మెల్యేగా సేవలందించిన నేత

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. చంద్రబాబు నాయుడు సోదరుడు, హీరో నారా రోహిత్ తండ్రి నారా రామ్మూర్తి నాయుడు (72) కన్నుమూశారు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రామ్మూర్తి నాయుడు ఈ నెల 14 న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఏఐజీ ఆస్పత్రి వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. నారా రామ్మూర్తి నాయుడుకు భార్య ఇందిర, ఇద్దరు కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. నారా ఖర్జూర నాయుడు, అమ్మణమ్మ దంపతులకు నారా రామ్మూర్తి నాయుడు రెండో కుమారుడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రామ్మూర్తి నాయుడు తండ్రికి తోడుగా వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసిన తర్వాత రామ్మూర్తి నాయుడు నాటకాలపై ఆసక్తితో తిరుపతిలో కళా పరిషత్ ఏర్పాటు చేశారు. ఆ కళా పరిషత్ ద్వారా నాటకాలు వేశారు. నారా చంద్రబాబు నాయుడు రాజకీయాల్లోకి వచ్చాక అన్నకు తోడుగా రామ్మూర్తి నాయుడు చేదోడు, వాదోడుగా ఉంటూ వచ్చారు. చంద్రబాబు కోసం ఇంటింటి ప్రచారం చేశారు. 1992లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన నారా రామ్మూర్తి నాయుడు..1994లో చంద్రగిరి నుంచి టీడీపీ



తరపున కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారిపై పోటీ చేసి విజయం సాధించారు.1996, 97, 98లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కబడ్డీ సంఘం ఛైర్మన్‌గా పనిచేశారు. అయితే 1999 ఎన్నికల్లో మరోసారి పోటీచేసిన రామ్మూర్తి నాయుడు ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత అనారోగ్యంతో రాజకీయాలకు దూరమయ్యారు. అయితే 2003లో ఢిల్లీలో సోనియా గాంధీ సమక్షంలో నారా రామ్మూర్తి నాయుడు కాంగ్రెస్ పార్టీ చేరారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమైన నారా రామ్మూర్తి నాయుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మరోవైపు నారా రామ్మూర్తి నాయుడు మరణవార్త విని ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు.. తిరుగు పయనమయ్యారు. నారా లోకేష్ కూడా హైదరాబాద్ చేరుకున్నారు. నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు. స్వగ్రామం నారావారిపల్లిలో అంత్యక్రియలు జరగనున్నాయి.

# జిల్లాను అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉంచాలి

## చేవెళ్ళ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 16, మహా:** అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని దిశ కమిటీ చైర్మన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధి, సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ళ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలు, వనరులు ఉన్నందున జిల్లాను అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉంచాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో మున్సిపాలిటీలలో, గ్రామా పంచాయతీలలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను విద్యార్థులు వినియోగించేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని బస్తీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, జిల్లా ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ పరికరాలను ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాష్ట్ర రాజధానికి సమీపాన ఉన్నందున కూరగాయలకు మంచి డిమాండ్, మార్కెట్ ఉందని అందువలన ప్రత్యామ్న్యాయంగా రైతులు కూరగాయలు, పండ్లు పండించే విధంగా రైతు వేదికల ద్వారా రైతులకు అవహగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సిబ్బందిని ని



యమించుకోవాలని, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని, రక్తహీనతను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిని ఆదేశించారు. యువతకు ఉపాధి కల్పించే దిశగా జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగాలు కల్పించాలని ఉపాధి కల్పనాధికారిని ఆదేశించారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని పరిశ్రమల శాఖ అధికారికి సూచించారు. సమావేశంలో భాగంగా పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఉపాధి హామీ, విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారులు, భూగర్భ జలాలు, సీపీఓ, గిరిజన సంక్షేమ శాఖ, వివిధ శాఖలకు సంబంధించి తదితర అంశాలపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని చైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) ప్రతిమ సింగ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్, హెచ్. ఎమ్.డబ్ల్యూడిసి, ఈ.డి.మయంక, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా అధికారులు తదితలురు పాల్గొన్నారు.

# టెక్స్ టైల్ పార్కుకు భూములు

**వరంగల్, మహా :** వరంగల్ లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు రాషఅ్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మెగా టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో స్పష్టం చేశారు. 2024 జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్ వరంగల్ జిల్లాకు వచ్చిన సందర్భంగా టెక్స టైల్ పార్కుకు భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు శనివారం 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ పై ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ



కాకతీయ మెగా టెక్స్ టైల్ భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలని చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటికి ఐదు లక్షల రూపాయలతో 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు.

# కొత్త అవతారం ఎత్తిన ఎమ్మెల్యే



**నల్లగొండ, మహా:** ఆయనో ప్రజా ప్రతినిధి.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ బిజీగా ఉంటారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన తన మూలాలను మర్చిపోలేదు. అధికార దర్పానికి దూరంగా ఆ ఎమ్మెల్యే.. వ్యవసాయ పొలంలో పనిచేస్తూ రైతు కూలీలతో కలిసిపోయారు. తాను ఎమ్మెల్యేనన్న ఆలోచనను పక్కన పెట్టి తన వ్యవసాయ పొలంలో సాధారణ రైతుగా అవతారం ఎత్తాడు. ఆయనేనకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం..

వీరేశం సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. నకిరేకల్ (ఎస్సీ) నియోజక వర్గం నుంచి 2014ఎన్నికల్లో బీఆరెస్ నుంచి గెలిచిన వీరేశం 2018ఎన్నికల్లో ఓడిపోయారు. తిరిగి 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ.. ఎమ్మెల్యే వీరేశం ప్రజా కార్యక్రమాలకు హాజరవుతూ నియోజకవర్గ ప్రజలకు తలలో నాలుకల ఉంటారు.

వానాకాలం సీజన్ ముగిసి.. యాసంగి సీజన్ కోసం రైతులు ఇప్పటినుంచే వరి నార్లు పోసుకుంటున్నారు. తాను ఎమ్మెల్యేనన్న ఆలోచనను పక్కన పెట్టి తన వ్యవసాయ పొలంలో సాధారణ రైతుగా అవతారం ఎత్తాడు. నకిరేకల్ సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో వరి విత్తనాలను చల్లి..పొలం పనుల్లో పాల్గొన్నారు. ప్రతి వానాకాలం, యాసంగి సీజన్లలో ఎమ్మెల్యే వేముల వీరేశం.. కూలీలతో కలిసి వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తుంటాడు. కూలీలతో కలిసి పొలంలో అడుగుమందు చల్లడం, మహిళా కూలీలకు నాట్లు వేసేందుకు అవసరమైన నారును అందిస్తుంటారు. ఎమ్మెల్యే తమతో కలిసి పనిచేయడం చూసిన కూలీలు ఆయన సాధారణ వ్యక్తిత్వాన్ని చూసి నిజమైన ప్రజా నాయకుడు అంటూ అభినందించారు.



# ఢిల్లీలో భారీగా డ్రగ్స్ పట్టివేత


## రూ.900 కోట్ల విలువైన కొకైన్ పట్టివేత

**ఢిల్లీ, మహా :** ఢిల్లీలో మరో భారీ డ్రగ్స్ రాకెట్ వెలుగుచూసింది. వెస్ట్ ఢిల్లీలోని జనక్ పురి, నంగ్లోయ్లోలో రూ. 900 కోట్ల విలువ చేసే 80కేజీల కొకైన్ ను నార్కోటిక్స్ అధికారులు పట్టుకున్నారు. ఆస్ట్రేలియాకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ఈ కన్ సైన్ మెంట్ లను అధికారులు సీజ్ చేశారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధ్రువీకరిస్తూ డ్రగ్స్ రాకెట్ పై నిర్దాక్షిణ్యంగా వేట సాగిస్తామని పేర్కొన్నారు. అలాగే అధికారులను అభినందించారు.

# సైబర్ నేరస్థుల వల

## మోసపోయిన మంత్రి.. వాట్సప్ ద్వారా రూ.2.08 కోట్లు స్వాహా

**లక్నో, మహా :** రోజురోజుకూ సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఎక్కువైపోతున్నాయి. ఎవరైనా కొంచెం అజాగ్రత్తగా కనిపిస్తే చాలు వారి ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. జనాలను సులువుగా మోసం చేస్తూ కోట్లకు కోట్లు కొట్టేస్తున్నారు. అయితే సాధారణ వ్యక్తుల నుంచి ప్రముఖుల వరకు అందరూ ఈ సైబర్ నేరాల బారిన పడుతున్న వారే ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డబ్బులు పోయిన తర్వాత బాధితులు మోస పోయామని గుర్తించి.. అప్పుడు పోలీసులను, సైబర్ క్రైం అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఏకంగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర మంత్రినే సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. అతని వద్ద నుంచి ఏకంగా రూ.2.08 కోట్లు స్వాహా చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న నంద్ గోపాల్ గుప్తా నందికి ఈ చేదు అనుభవం ఎదురైంది. మంత్రి కుమారుడి పేరుతో ఆయన అకౌంటెంట్ రితేష్ శ్రీవాస్తవను మోసం చేసి సైబర్ నేరగాళ్లు రూ.2.08 కోట్లు కొట్టేశారు. రెండు రోజుల క్రితం.. మంత్రి నంద్ గోపాల్ గుప్తా అకౌంటెంట్ వాట్సాప్ నంబర్‌కు ఒక మెసేజ్ వచ్చింది. అది మంత్రి కుమారుడు ఫోటో డీపీగా ఉన్న వాట్సాప్ నంబర్. అయితే తాను ముఖ్యమైన బిజినెస్ మీటింగ్‌లో ఉన్నానని ఇది తన కొత్త నంబర్ అని వెంటనే తాను చెప్పిన అకౌంట్ నంబర్‌కు డబ్బులు పంపించాలని



తెలిపారు. మీటింగ్ కారణంగా తాను మాట్లాడలేక పోతున్నానని, తనకు అర్జంట్‌గా డబ్బులు కావాలని ఆ మెసేజ్‌లో ఉంది.

మీటింగ్ ఎక్కువసేపు పట్టే అవకాశం ఉంది కాబట్టి తనకు వెంటనే డబ్బులు పంపించాలని అకౌంటెంట్ రితేష్ శ్రీవాస్తవకు ఒక కొత్త నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. అయితే మంత్రి కుమారుడి ఫోటో డీపీగా ఉండటంతో అది నమ్మేసిన అకౌంటెంట్ ఆ వాట్సాప్‌లో వచ్చిన అకౌంట్ నంబర్లకు 3 సార్లు డబ్బులు పంపించారు. ఈ క్రమంలోనే మొత్తంగా రూ.2.08 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అయితే ఈ విషయాన్నిఆయన ఎవరికీ తెలియజేయలేదు. ఆ తర్వాత మంత్రి కుమారుడిని అడగ్గా తాను ఎవరికీ మెసేజ్ పంపలేదని, డబ్బులు అడగలేదని తేలింది. దీంతో సైబర్ క్రైమ్ జరిగిందని గుర్తించారు. వెంటనే సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన రెండు సైబర్ క్రైమ్ టీమ్‌లు.. ఆ నేరగాళ్లను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఆ డబ్బులు ఎవరి ఖాతాల్లో, ఏ బ్యాంకులకు ట్రాన్స్‌ఫర్ అయ్యాయో గుర్తిస్తున్నారు. ఆ ఖాతాలు ఎవరి పేర్లపై ఉన్నాయో బ్యాంకు అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఆ బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేసేందుకు చర్యలు చేపట్టారు.

# గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధం

- 2 రోజుల పాటు పరీక్షల నిర్వహణ
- 1401 పరీక్షా కేంద్రాల్లో 5.36 లక్షల మంది పరీక్ష రాసే అవకాశం
- గంటన్నర ముందుగానే ప్రీక్ష కేంద్రానికి చేరుకోవాలన్న టీజీపీఎస్ సీ

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్3 పోస్టుల భర్తీకి సంబంధించి ఆది సోమవారాలలో పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్ సీ) ఏర్పాట్లు పూర్తి చేసింది.. మొదటి రోజు (ఆదివారం) రెండు పరీక్షలు, రెండో రోజు (సోమవారం) ఒక పరీక్ష నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం గం. 10 నుంచి మధ్యాహ్నం గం. 12.30 వరకు పేపర్1, మధ్యాహ్నం గం. 3 గంటల నుంచి సాయంత్రం గం. 5.30 వరకు పేపర్2 పరీక్ష నిర్వహిస్తారు.పేపర్3 పరీక్ష సోమవారం ఉదయం గం. 10 నుంచి మధ్యాహ్నం గం. 12.30 వరకు నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో జరిగే గ్రూప్3 పరీక్షలకు 5.36 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇప్పటికే 80 శాతం మంది విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని టీజీపీఎస్ సీ తెలిపింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 1,388 గ్రూప్3 పోస్టుల భర్తీకి డిసెంబర్ 2022లో నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్3 పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు అప్పగించింది. పరీక్షా కేంద్రాలను స్వయంగా తనిఖీ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని టీజీపీఎస్ సీ కార్యాలయానికి అనుసంధానం చేసి నేరుగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. గ్రూప్3 అభ్యర్థులను పరీక్షా సమయానికి గంటన్నర ముందుగా పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రానికి కనీసం గంట ముందుగా చేరుకోవాలని టీజీపీఎస్ సీ సూచించింది. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే సెంటర్ల గేట్లను మూసివేస్తారని, నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు.

# ధనుష్ x నయనతార

## .. నీకు మనస్సాక్షి ఉందా ధనుష్.. భగ్గుమన్న నయనతార.. మూడుపేజీల లేఖ.. అసలేంటీ వివాదం?




లేడి సూపర్ స్టార్ నయనతార ప్రముఖ హీరో ధనుష్ పై దుమ్మెత్తి పోస్తూ, అతడి నిజస్వరూపం ఇదే అంటూ 3 పేజీల బహిరంగ లేఖతో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ లేఖలో ధనుష్ క్యారెక్టర్ ని తప్పుబడుతూ నయనతార తీవ్రమైన ఆరోపణలు చేసింది. 2015లో నయనతార ధనుష్ నిర్మించిన నానుమ్ రౌడీ దాన్ అనే చిత్రంలో నటించింది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, నయన్ జంటగా నటించారు. సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఆ తర్వాత కాలంలో నయన్, ధనుష్ మధ్య కొన్ని విభేదాలు తలెత్తాయి. రీసెంట్ గా నయనతార తన పెళ్లి, కెరీర్, లైఫ్ గురించి బయోపిక్ తరహాలో డాక్యుమెంటరీ చిత్రాన్ని నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ చేయనున్నారు. 'నయనతార : బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే టైటిల్ తో డాక్యుమెంటరీ చిత్రాన్ని నవంబర్ 18న రిలీజ్ చేస్తారు. ఇటీవల దీనికి సంబంధించిన ట్రైలర్ విడుదలైంది. ఈ ట్రైలర్ నుంచి విభేదాలు మొదలయ్యాయి. ధనుష్ నిర్మించిన నానుమ్ రౌడీ దాన్ చిత్రంలోని పాటకి సంబంధించిన 3 సెకండ్ల వీడియో ఈ డాక్యుమెంటరీలో ఉపయోగించారు. తన అనుమతి లేకుండా ఆ వీడియో ఉపయోగించడం ధనుష్ కి నచ్చలేదు. నయనతారపై కోర్టులో ఏకంగా 10 కోట్ల కాపీ రైట్ కేసు నమోదు చేశాడు. కొన్ని రోజుల పాటు నయన్, ధనుష్ మధ్య ఈ వ్యవహారంలో చర్చలు జరిగినట్లు టాక్. రాజీ కుదరకపోవడంతో నయన్ ఒక్కసారిగా బ్లాస్ట్ అయింది. ధనుష్ పై ఏకంగా 3 పేజీల లేఖతో విరుచుకుపడింది. నయనతార ఈ లేఖలో ధనుష్ ని ఉద్దేశిస్తూ.. చిత్ర పరిశ్రమకి చెందిన ప్రముఖ వ్యక్తి కొడుకుగా, ప్రముఖ డైరెక్టర్ సోదరుడిగా ఇండస్ట్రీలోకి వచ్చి మంచి గుర్తింపు పొందావు. ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా ఒంటరి పోరాటం చేస్తూ నేను ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నా. నాపై నీకు గతం నుంచి పగ ఉందని తెలుసు. కానీ ఈ స్థాయిలో నీ నీచ బుద్ధిని బయటపెడతావని అనుకోలేదు. నాకు సంబంధించిన నెట్ ఫ్లిక్స్ డాక్యుమెంటరీ చిత్రం రిలీజ్ కోసం నా సన్నిహితులు, అభిమానులు అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ డాక్యుమెంటరీ రూపొందించడం వెనుక చాలా మంది సాయం, కష్టం ఉంది. నా సినీ జీవితానికి సంబంధించిన క్లిప్స్, అనేక విషయాలు ఈ డాక్యుమెంటరీలో పొందుపరిచాం. నా శ్రేయోభిలాషులు చెప్పిన మాటలు కూడా ఉంటాయి. కానీ నా కెరీర్ లో కీలకమైన నానుమ్ రౌడీ దాన్ చిత్రంలోని క్లిప్స్ ని మాత్రం ఉపయోగించలేకపోయాం. దీని గురించి నిన్ను ఎన్నిసార్లు రిక్వస్ట్ చేసినా రిజెక్ట్ చేశావు.

### కక్షతో నువ్వు కేసు వేశావు

బిజినెస్ లెక్కలు వేసుకుని, నా పై ఉన్న కక్షతో నువ్వు కేసు వేశావు. నానుమ్ రౌడీ దాన్ చిత్రానికి సంబంధించిన అన్ని క్లిప్స్ ని ఎడిటింగ్ లో తొలగించాం. నువ్వు అనుమతులు ఇవ్వలేదు కాబట్టి అలా చేయక తప్పలేదు. ఈ చిత్రంలోని పాటలు నా కెరీర్ లో ప్రత్యేకం. నా డాక్యుమెంటరీకి ఆ పాటలు బాగా సరిపోతాయి. కానీ తొలగించక తప్పలేదు. పదేళ్ల క్రితం విడుదలైన చిత్రానికి సంబంధించిన 3 సెకండ్ల క్లిప్ వాడుకుంటే కేసు వేశావ్.. కనీసం మనసాక్షి అనేది కూడా లేదు. ప్రతిసారి నువ్వు నీ అహాన్ని బయటపెడుతూనే ఉన్నావ్.. నీ సాటి వ్యక్తులు ఎదిగితే జీర్ణించుకోలేని వ్యక్తిత్వం నీది.





# తాజా రాజకీయ పరిణామాలపై..

**ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



KANDI RAMACHANDRA REDDY WEEEKEND

రాజకీయమంటేనే యుద్ధరంగం. ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తుంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ళు పనిచేశారు. ఒక్కో నాయకుడిది ఒక్కో శైలి. అలవాటైన తరవాత అధికారం పోతే బాధగానే ఉంటుంది. అధికారం కోల్పోవడం ఏ నేరమో, ఘోరమో కాదు. అది కేవలం ఒక ఐదేళ్ల కాలానికి ప్రజామోదం పొందకపోవడం మాత్రమే. ప్రజలు ఎంతో పరిణతితో ఆలోచిస్తారు. ప్రతీదీ గమనిస్తారు. ప్రజలను తక్కువ అంచనా వేసిన వారు.. రాజకీయ క్షేత్రం నుండి కనుమరుగు అవుతారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. అధికారం శాశ్వతమని ఉద్రేకపడిన వారిని ఐదేళ్ళకే మూలన కూర్చోపెట్టిన చరిత్ర ప్రజలకు ఉంది. ప్రజలు తమను ఎందుకు పక్కకు కూర్చోబెట్టారో గుర్తించి మార్చుకున్నపుడే భవిష్యత్తు ఉంటుంది. రాజకీయాల్లో కేసీఆర్ గండరగండడు. అసాధ్యాలను సుసాధ్యం చేస్తాడన్న పేరుంది. కేసీఆర్ గురిచూసి ఉచ్చు పన్నితే గండుచీమలే కాదు..గండభేరుండాలు కూడా పడిపోవాల్సిందే అన్న నానుడి. మరి అలాంటి నాయకుడిని ఇంటికే పరిమితం చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంత నేర్పరితనం, దీక్ష, సమర్ధత ఉండాలి? గత పదకొండు మాసాలుగా రేవంత్ రెడ్డి తన శైలికి భిన్నంగా పరిపాలన కొనసాగిస్తున్నారు. సభల్లోనే ఆవేశాలు తప్ప పాలనలో పక్షపాతం చూపడం లేదన్న అభిప్రాయాలున్నాయి. డిసెంబర్ 7తో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఏడాది పూర్తిచేసుకోబోతుండగా, వర్కింగ్ స్టైల్ మారుతుందన్న చర్చ జరుగుతోంది. తొలి ఏడాది విద్య, ఉపాధి, పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో తన ఆలోచనలు నాటిన సీఎం రేవంత్ రెండో ఏడాది విభిన్నంగా కొనసాగుతారన్న చర్చ జరుగుతోంది.

### కులగణన సర్వేతో రేవంత్ సంచలనం

కులగణన చేపట్టాలని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత కొన్నేళ్ళుగా డిమాండ్ చేస్తున్నారు. లోక్ సభలో బయటా ఆయన హామీలిస్తున్నారు. రాహుల్ ఆలోచనలు అమలుచేసే సీఎం రేవంత్ తెలంగాణలో కులగణన సర్వే అమలుకు పూనుకున్నారు. కులగణన సర్వే తెలంగాణ ప్రభుత్వం చేపట్టడం ఓ సాహసమే. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 50శాతం సర్వే పూర్తయింది. ఈ కులగణన అమలుచేస్తే దేశంలోనే గేమ్ ఛేంజర్ గా తెలంగాణ మారుతుంది. జనాభా ప్రాతిపదికన బలహీనవర్గాలకు అవకాశాలు దక్కితే ప్రయోజనమే. అయితే ప్రధాని నరేంద్ర మోడీ దీనిని వ్యతిరేకిస్తున్నారు. విడిపోతే బలహీనమవుతాం అని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వపరంగా పూర్తిస్థాయి పాజిటివిటీని సంపాదించుకోలేకపోతోంది. ఇందుకు బిఆర్ఎస్, బిజెపి సోషల్ మీడియాల దూకుడు కూడా కారణం కావొచ్చు. అధికారం వచ్చాక.. లక్ష్యం సాధించామని కాంగ్రెస్ సోషల్ మీడియా, మద్దతుదారుల పదును తగ్గిందనే అభిప్రాయాలున్నాయి. వాస్తవానికి అధికారంలోకి వచ్చాక మరింత బలంగా ధృడంగా కాపుగాయాల్సిన అవసరం వర్తమాన రాజకీయాలు కల్పిస్తున్నాయి.

### దేశంలో పవర్ ఫుల్ సీఎంగా చంద్రబాబు

దేశ రాజకీయాల్లో బాబు బ్యాక్ అయ్యారు. ఇపుడు బాబు చేతులమీద, చేతల మీద కేంద్రప్రభుత్వం ఆధారపడి ఉంది. గత టర్మ్ లో కాలక్షేప కార్యక్రమాల్లో టైం కోల్పోయిన బాబు ఈసారి మాత్రం గత టర్మ్ కు భిన్నంగా దూకుడు చూపిస్తున్నాడు. నిర్ణయాల్లో వేగం, ముందు చూపు దటీజ్ బాబు అనేలా చేస్తున్నాయి. 95 సీఎంను చూస్తారు అంటూ.. మాటలు కాకుండా చేతల్లో పదును చూపిస్తున్నారు. ఈనెల 29న ప్రధాని మోడీ ఎపికి రానున్నారు. ఎన్టీపీసీ రూ.80వేల కోట్ల పెట్టుబడులతో స్థాపించనున్న గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లతోపాటు గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈసారి పారిశ్రామిక ప్రగతిపై, ఉపాధి కల్పనపై చంద్రబాబు పూర్తిస్థాయి దృష్టి పెట్టినట్లు స్పష్టంగా కనబడుతోంది. బాబు 4.0 ఎపికి ఆర్థిక స్థిరత్వాన్ని సమకూరుస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### మహా ఫలితాలు

మహా రాష్ట్ర ఫలితాలు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. జమిలిపై పట్టుదలగా ఉన్న ప్రధాని నరేంద్రమోడీ నిర్ణయాలపై మహా ఎఫెక్ట్ ఉండనుంది. మహారాష్ట్రలో కాంగ్రెస్ గెలిస్తే దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ఊపు వస్తుంది. బిజెపి కూటమి విజయం సాధిస్తే సౌత్ లో ఈ తరహా ప్రయోగాలు చేపట్టనుంది. ఓవైపు రేవంత్ రెడ్డి, మరోవైపు చంద్రబాబు మహారాష్ట్ర ఎన్నికల్లో రెండుకూటముల తరుపున హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. తెలుగునేతల ప్రభావం మహారాష్ట్రపై ఎలా ఉన్నా, మహారాష్ట్ర ఫలితం మాత్రం తెలుగు రాష్ట్రాల రాజకీయాలను ప్రభావితం చేయడం తథ్యం.

# మీ ఇల్లు బంగారం కానూ..

## గోల్డ్ లవర్స్ గెట్ రెడీ

### తులం.. 50వేలే.. ధమాల్ అంటున్న గోల్డ్ రేట్స్



**మహా బిజినెస్:** గోల్డ్ లవర్స్... బీ రెడీ... మీరు ఊహించని బంపర్ ఆఫర్.. ఎగిరెగిరి పడ్డ బంగారం అందుబాటులోకి వస్తోంది. ట్రంప్ గెలుపు ఇండియన్స్‌కు గోల్డెన్ ఆఫర్ ఇచ్చింది. పసిడి ధర 15రోజుల్లో 5వేలు తగ్గింది. మరి బంగారం ఇంకెంతకాలం పడిపోతుంది...? 50వేల స్థాయికి వస్తుందా...? ఇప్పుడు కొనాలా ఇంకా వెయిట్ చేయాలా. మగువలకు మంచి కిక్కిచ్చే వార్త ఇది. ఇన్నాళ్లూ వారిని బెంబేలెత్తించిన బంగారం ఇప్పుడు దిగి వస్తోంది. ఎవరూ ఊహించని స్థాయిలో పడిపోతూ మగువల మనసుల్ని బంగారం షాపులవైపు తెగ లాగుతోంది. రారమ్మని రారారమ్మని ఊరిస్తోంది. ఇంట్లో పెళ్లో మరో శుభకార్యమో ఉంటే మాత్రం ఇది వారికి నిజంగా బంగారం లాంటి అవకాశమే. ట్రంప్ గెలిస్తే రేటు తగ్గుతుందని భావించినా ఈ స్థాయిలో పడిపోవడాన్ని మాత్రం ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేయలేదు. వరుసగా నాలుగు రోజులు బంగారం ధర దిగివచ్చింది. హైదరాబాద్‌లో 10గ్రాముల బంగారం రోజుకు వేయి రూపాయల వరకూ పడిపోతోంది. నాలుగు రోజుల్లో 3వేల 7వందల రూపాయలు పడిపోయింది. హైదరాబాద్‌లో 24క్యారెట్ల పసిడి 10గ్రాముల ధర 75వేల 760రూపాయలుగా ఉంది. నవంబర్1న ఇది 80వేల 560 రూపాయలు. అంటే 15రోజుల్లో దాదాపు 5వేలు తగ్గింది. ఇక 22క్యారెట్ల బంగారం కూడా అప్పుడు 73వేల 850 రూపాయలుంటే ఇప్పుడు 69వేల 450రూపాయలుగా ఉంది. అంటే నాలుగున్నర వేలు డ్రాప్ అయ్యింది. ఇక సిల్వర్ అయితే ఒక్క రోజులో 2వేలు తగ్గి లక్షకు దిగువకు వచ్చింది. నవంబర్1న లక్షా ఆరువేలున్న కేజీ వెండి ఇప్పుడు 99వేలకు తగ్గింది. అంటే ఏకంగా 7వేలు పడిపోయిందన్నమాట. ట్రంప్ గెలవడం, డాలర్ బలపడటం, బాండ్ రాబడులు పెరగడం, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుతాయన్న అంచనాలు బంగారం పతనానికి కారణమవుతున్నాయి. సాధారణంగా స్టాక్‌మార్కెట్లు పడిపోతున్న సమయంలో బంగారం మెరవాలి..కానీ ఈసారి అదీ, ఇదీ రెండు పడిపోవడం విచిత్రమే. అంతర్జాతీయంగా బంగారం ధరలు భారీగా పడిపోతున్నాయి. ఔన్సు బంగారం ధర ఒక్కరోజులో 40 డాలర్లు తగ్గింది. ఇది కూడా దేశీయంగా బంగారం ధరలు తగ్గడానికి కారణమవుతోంది. బిట్‌కాయిన్ బూమ్ కూడా గోల్డ్‌ను దెబ్బతీస్తోంది. ప్రస్తుతం బంగారం ధరలు నెల రోజుల కనిష్ఠంలో ట్రేడ్ అవుతున్నాయి.

**50వేలకు ?**

తులం బంగారం 50నుంచి 60వేల మార్క్‌ను టచ్ చేస్తుందని కొందరు చెబుతున్నప్పటికీ ఆ స్థాయిలో పడిపోయే అవకాశాలు లేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరో 10శాతం వరకు కరెక్షన్ రావొచ్చని 24క్యారెట్ల బంగారం 10గ్రాముల ధర 7274వేల వరకు వచ్చి ఆ తర్వాత అక్కడే స్థిరపడొచ్చని అంటున్నారు. మధ్యలో అంతర్జాతీయ పరిణామాలతో ఒక ట్రెండు రోజులు కాస్త పెరిగినా షార్ట్‌టర్మ్‌లో మాత్రం తగ్గుతుందన్నది మెజారిటీ ఎనలిస్టుల మాట. గతేడాది ఇదే సమయానికి 10గ్రాముల బంగారం ధర 60వేల 350 రూపాయల వరకు ఉంది. ఇప్పుడు అది 75వేల దగ్గర ఉంది. దాదాపు 22శాతం పెరిగింది. ఈ పది రోజుల్లో తగ్గకపోతే ఇంకా ఎక్కువే ఉండేది. ఆ దూకుడు ఇప్పట్లో ఉండే అవకాశాలు లేవు. కొన్నాళ్ల పాటు ఇదే రేటుకు కాస్త అటూ ఇటుగా కదలాడొచ్చు. మార్కెట్ అంచనాల ప్రకారం 24క్యారెట్ల బంగారం 10గ్రాములకు 72వేల 623రూపాయల దగ్గర సపోర్ట్ ఉంది. అంతకుమించి తగ్గితే 70వేల280వరకు వస్తుందని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత మళ్లీ పుంజుకోవచ్చు. ప్రస్తుతానికి గోల్డ్ బేరిష్‌గా ఉన్నా అది షార్ట్ టర్మ్‌కే అంటున్నారు. మీడియం, లాంగ్‌టర్మ్‌లో మళ్లీ పరుగు మొదలుపెడుతుందని భావిస్తున్నారు. కాబట్టి పడినప్పుడల్లా కొంత కొంత కొనుక్కోవడం మంచిదంటున్నారు. అందరూ అంచనా వేస్తున్నట్లు 5060వేల రేంజ్‌కు మాత్రం రాకపోవచ్చు. వస్తే 70వేల వరకు వచ్చి మళ్లీ పెరిగే అవకాశాలున్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చాక మళ్లీ పరిస్థితులు కుదుటపడి బంగారం మళ్లీ పుంజుకుంటుందని వచ్చే ఏడాదికి మళ్లీ పరుగు మొదలుపెట్టడానికి అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక వెండి కూడా 88వేల వరకూ వస్తుందని కొందరు లెక్కగడుతున్నారు. కాబట్టి బంగారం కొనడానికి ఇదే మంచి సమయం అని భావించొచ్చు. రేటు ఏ మాత్రం తగ్గినా కొని పెట్టుకోవడం మంచిదని నిపుణుల సూచన.

### ఎంత పడిపోతుంది

ఇంతకీ బంగారం ఇంకెంత పడిపోతుందన్న ప్రశ్నకు నిపుణుల నుంచి కూడా సరైన సమాధానం లేదు. ఎవరూ కూడా ఎంతవరకు రేటు పడిపోతుందన్నది చెప్పలేకపోతున్నారు. ఎవరి లెక్కలు వారివి.. ఎవరి అంచనాలు వారివి. డాలర్ బలపడే కొద్దీ దేశీయంగా బంగారం ధర మరింత తగ్గుతుంది. ట్రంప్ అధికారం చేపట్టేవరకు డాలర్ ర్యాలీ కొనసాగుతుందన్నది ఓ అంచనా. ఆ ప్రకారం చూసుకుంటే మరో రెండు నెలల పాటు బంగారానికి గడ్డు రోజులే. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో స్పాట్ ఔన్స్ బంగారం ధర కీలకమైన సపోర్ట్ లెవల్ 2వేల600డాలర్ల దిగువకు పడిపోవడంతో మరింత తగ్గుతుందన్న అంచనాలున్నాయి. దిగుమతులపై సుంకాలు విధించడం, పన్నులు తగ్గించడం వంటి ట్రంప్ నిర్ణయాలు అమెరికాలో ద్రవ్యోల్బణం పెంచే అవకాశం ఉంది. దీంతో ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపును ఆపివేయవచ్చు. అదే జరిగితే బంగారంవైపు పెట్టుబడులు మరింత తగ్గుతాయి. దీంతో బంగారం ధర మరింత తగ్గుతుంది.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

editor@mahaadaily.com | whatsapp- 7436939999

# నేటి నుంచి గ్రూప్3 పరీక్షలు

## సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు

### 87 పరీక్షా కేంద్రాలలో 27వేల 984 మంది అభ్యర్థులకు ఏర్పాట్లు

- నవంబర్ 17న రెండు సెషన్స్, 18న ఉదయం గ్రూప్ -3 పరీక్షల నిర్వహణ
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

**ఖమ్మం, నవంబర్ 16, మహా :** జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలను సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ గ్రూప్ 3 పరీక్షా కేంద్రాలలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. చింతకాని మండలం రామకృష్ణాపురం లోని సెంట్ థెరిస్సా పాఠశాల, ఖమ్మం విన్ ఫీల్డ్ పాఠశాల, ఖమ్మం రూరల్ మండలం సత్య నారాయణపురంలోని దరిపెల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, పెద్దతండా లోని ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లలో పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, రూట్ అధికారులు, ప్రాంతీయ కోఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా పరీక్షను నిర్వహించాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి సమాచారం, సహాయం కావాలన్నా వెంటనే ప్రాంతీయ కోఆర్డినేటర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, శాఖాధికారులు, రూట్ అధికారులు, రీజనల్ కోఆర్డినేటర్లతో సమన్వయంతో ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని ప్రతి హాల్ లో 24 మంది అభ్యర్థులకు సీటింగ్ అరేంజ్మెంట్, నిబంధనల మేరకు చేయాలని అన్నారు. కిటికీలు, కాంపౌండ్ వాల్ ల వద్ద ఎటువంటి తప్పులు జరగకుండా భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. కిటికీల వద్ద, పరీక్షా హాళ్లలో ఉన్న చెత్త, స్టడీ మెటీరియల్, పోస్టర్లు పూర్తిస్థాయిలో తొలగించాలని అన్నారు. పరీక్షా కేంద్రానికి కేటాయించిన అభ్యర్థుల సంఖ్య మేరకు కావాల్సిన ఫ్రిస్కింగ్ సిబ్బంది ఏర్పాటుచేసుకోవాలన్నారు. ప్రతి అభ్యర్థిని పక్కగా పరిశీలించిన తరువాత మాత్రమే లోపలికి అనుమతించాలని అన్నారు. మహిళా అభ్యర్థులను చెక్ చేసేందుకు మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. అభ్యర్థికి కేటాయించిన గది నెంబర్, త్రాగునీరు, టాయిలెట్లు పరీక్ష హాల్స్ ఎక్కడ ఉన్నాయో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. నవంబర్ 17 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 530 వరకు రెండు సెషన్లు, నవంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1230 వరకు గ్రూప్3 పరీక్షలు జరుగుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 27 వేల 984 మంది అభ్యర్థులు పరీక్షలు వ్రాయనున్నారని, వీరి కోసం 87 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు స్టీఫెన్, పుల్లా రావు, కిరణ్, గోపాల్, అధికారులు, తదితరులు కూడా ఏర్పాట్లను పరిశీలించారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

**అశ్వరావుపేట, నవంబర్ 16, మహా :** ములకలపల్లి మండలం మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను ఆయన పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని అన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంట వెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి త్రినాథ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో బియ్యం వితరణ



**బోనకల్, నవంబర్ 16, మహా:** మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షులు రుద్రాక్షల మల్లయ్య చారి ఇటీవల మరణించగా వారి కుటుంబానికి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం 50 కేజీల రైస్ బ్యాగ్ ను అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వారి కుటుంబానికి విశ్వబ్రాహ్మణ సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ చారి, జిల్లా కార్యదర్శి పంతంగి శ్రీనివాసచారి, మండల అధ్యక్షుడు రావుట్ల వెంకటాచారి, మండల ప్రధాన కార్యదర్శి తాటికొండ విసిగ్నాచారి, సహాయ కార్యదర్శి రావుట్ల లక్ష్మీనారాయణ చారి, చిట్టోజు సతీష్ చారి, ప్రచార కార్యదర్శి బంగారు అప్పలాచారి, మోదేపల్లి వీర బ్రహ్మచారి, విశ్వ బ్రహ్మచారి ద్రోణాజుల నాగ బ్రహ్మచారి, వైరా మండల అధ్యక్షులు రుద్రాక్షల నరసింహ చారి చింతకాని నాయకులు బస్వాచారి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్3 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 13,478 మంది అభ్యర్థులు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 16, మహా:** ఈ నెల 17, 18 తేదీలలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగునున్న గ్రూప్3 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కొత్తగూడెంలోని 26 పరీక్షా కేంద్రాలు, పాల్వంచలోని 13 పరీక్షా కేంద్రాలు.. మొత్తం 39 కేంద్రాల వద్ద సుమారుగా 350 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఈ నెల 17వ తారీఖున ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుండి 5.30 గంటలకు పరీక్షలు జరుగుతాయన్నారు. సోమవారం 18వ తారీఖున ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు పరీక్షా సమయాన్ని నిర్ణయించారన్నారు. జిల్లా వ్యాప్తంగా 13,478 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. పరీక్ష రాయడానికి పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థులు ఉదయం 9.30 గంటలు లోపు, మధ్యాహ్నం అయితే 14.30 గంటల లోపు హాజరుకావాలన్నారు. అదేవిధంగా అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రంలోకి తీసుకుని రాకూడదని, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పోలీస్ శాఖ పనిచేస్తుందని తెలిపారు. మంటను ప్రేరేపించే వస్తువులను గానీ, ఇంకు బాటిల్స్, అనుమతి లేని ఇతర వస్తువులను తమ వెంట తీసుకురాకూడదని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారి నియమ నిబంధనల ప్రకారం అభ్యర్థులు నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్3 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి అపోహలకు, ఆందోళనకు గురికాకుండా పరీక్షకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రూప్ 3 పరీక్షా కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణలు సమావేశం ఏర్పాటు చేసి బ్రీఫింగ్ చేశారు.



## ఉచితంగా మందులు పంపిణీ



**మణుగూరు, నవంబర్ 16, మహా:** స్థానిక 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్ లో పుష్పగిరి కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న పేషెంట్లకు శనివారం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఉచిత మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్పగిరి కంటి ఆసుపత్రి మేనేజ్మెంట్ వారు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అనేకమంది పేదలకు ఉచిత కంటి వైద్యం చేసి పేద ప్రజల కంటికి వెలుగునిస్తున్నారని కొనియాడారు. భద్రాచలం డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు పేషెంట్ల కోసం బస్సు సదుపాయం, భోజన సదుపాయాన్ని అందజేసి సేవ స్ఫూర్తిని చాటుకున్నారని, ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నటువంటి పుష్పగిరి హాస్పటల్ వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ సునీల్, కంటి వైద్యులు డా సంజీవరావు, డాక్టర్ నరేష్, డాక్టర్ గౌరీ ప్రసాద్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల సృజనాత్మకత భేష్

**కొత్తగూడెం, నవంబర్ 16, మహా:** ఒకే వేదికపై ఇంతమంది చిన్నారుల సృజనాత్మకతను కళ్లారా చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తుందని, మీ సృజనకు ఇంకా పదును పెడితే జీవితాలు ఉన్నత స్థాయికి చేరుతాయని రామచంద్ర పీజీ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కే వనజ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు అయిన శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ, మా చిన్ననాటి రోజుల్లో చదువుకోటానికి సౌకర్యాలు అతి తక్కువగా ఉండేవని, ప్రస్తుతం సౌకర్యాలు పెరిగాయని చెప్పారు. విద్యార్థులంతా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని చక్కటి చదువులు కొనసాగించాలన్నారు. బ్రతుకు గమనాన్ని మార్పు చేసే శక్తి కేవలం ఒక చదువుకు మాత్రమే ఉందని, పేదవాని పిల్లలు కూడా గొప్పవారిగా తయారు చేసే ఏకైక సాధనం చదువు ఒక్కటే అని అన్నారు. ఇలాంటి గ్రంథాలయాల ద్వారా చదువుకునేందుకు అవకాశాలు దొరుకుతున్నాయని, తలదించి పుస్తకాన్ని చదివితే అదే పుస్తకం నిన్ను తల ఎత్తుకునేలా చేస్తుందని చెప్పుకొచ్చారు. ఇలాంటి కార్యక్రమాలకు వచ్చి చిన్నపిల్లలతో గడపటం తనకెంతో ఆనందాన్ని ఇస్తుందని, చాలాకాలం తర్వాత తన బాల్యం గుర్తుకు వచ్చి మనసు నిండుగా సంతోషం అనిపిస్తుందని అన్నారు. అనంతరం జూనియర్స్ సీనియర్స్ విభాగానికి దేశభక్తి గీతాల ఆలాపన, పర్యావరణ పరిరక్షణ, సెల్ఫోన్ లాభనష్టాలు అనే అంశంపై వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి మణి మృదుల, గ్రంథ పాలకులు మధు బాబు, నాగన్న, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - డీఎంహెచ్వో గోపాల్ రావు



**ములుగు జిల్లా ప్రతినిధి, మహా :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎన్.గోపాల్ రావు సూచించారు. శనివారం ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్ సీలలో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందడంలో పర్యవేక్షకుల పాత్ర కీలకమైందని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో పర్యవేక్షకులు సరైన పనితీరును అవలంబించకపోతే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. లక్ష్య సాధన, కాల పరిమితిని దృష్టిలో ఉంచుకొని నిర్దిష్టమైన సూక్ష్మ ప్రణాళికలను తయారు చేసుకొని వాటికి అనుగుణంగా క్రింది స్థాయి ఉద్యోగులను సమన్వయపరచుకుంటూ లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో వారంలో బుధ, శని వారాలలో నిర్వహించే కార్యక్రమాల్లో లబ్ధిదారులైన పిల్లలకు ముందస్తుగానే టీకాల సమయం, తేదీని తెలియపరచాలన్నారు. అసంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమం మూడవ ఫేస్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలవరకు పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలము పూర్తి అయినప్పటికీ మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్ కుమార్, శ్రీకాంత్, రణధీర్, ఇంచార్జ్ మాస్ మీడియా ఆఫీసర్ సంపత్, ఏఎంఓ దుర్గారావు, డీపీ హెచ్ఎంఓ శకుంతల, డీపీఎం సాంబయ్య, సంజీవరావు, సత్యనారాయణ, ఆఫీసర్స్ వెంకట్ రెడ్డి, భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 23న దివ్యాంగుల ఆటల పోటీలు

**ఖమ్మం, నవంబర్ 16, మహా :** నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నవంబర్ 23న దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు పాల్గొనాలని జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అంధులకు పరుగు పందెం, షాట్ పుట్, చెస్ పోటీలు, శారీరక వికలాంగులకు మూడు చక్రాల సైకిల్ తో పరుగు పందెం, షాట్ పుట్, క్యారం బోర్డ్, మానసిక వికలాంగులకు, బధిరులకు పరుగు పందెం, షాట్ పుట్, క్యారం బోర్డ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 10 నుంచి 17 సంవత్సరాలలోపు వయస్సు గల వారికి జూనియర్ కేటగిరీలో, 18 నుంచి 54 సంవత్సరాల వయస్సు గల వారికి సీనియర్ కేటగిరీలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు నవంబర్ 23న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంకు సదరం సర్టిఫికేట్ తో సహా చేరుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పేర్కొన్నారు.

## విద్యార్థినీలకు అవగాహన సదస్సు



**సత్తుపల్లి, నవంబర్16, మహా:** ఎదుటివారి దుర్బుద్ధిని అంచనా వేసి ప్రమాదం నుంచి తప్పించుకునే విధంగా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సోనీ ప్రేమ్ లీల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో మండల పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కార్లపల్లి ఎం.పీ.పీ.ఎస్ గవర్నమెంట్ స్కూల్, ఎం.పీ.పీ.ఎస్ హరిజనవాడ స్కూల్, ఎం.పీ.పీ.ఎస్ బొడు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఆఫీసర్ సోనీ ప్రేమ్ లీల మాట్లాడుతూ యుక్త వయసుకు వస్తున్న విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు స్వయం రక్షణ పై దృష్టి సారించాలన్నారు. తెలియని మనుషుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఎదుటి వారి దృష్టి ప్రవర్తనను పసిగట్టి ప్రమాదం నుండి బయటపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ కనకదుర్గ, మాధవి, అనిత, హెచ్ఎం సరోజిని, శ్రీనివాసరావు, నరసింహారావు, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత

### : జీఎం దుర్గం రాంచందర్

**మణుగూరు, నవంబర్ 16, మహా :** మణుగూరు ఏరియాలోని అన్నీ గనులు, డిపార్ట్మెంట్ల యందు విధులు నిర్వహిస్తున్న మహిళా బదిలీ వర్కర్, మహిళా జనరల్ మజ్దూర్లకు ఏరియాలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులలో ఉద్యోగ అవకాశాలు పొందుటకు గాను 68 మందికి గాను 58 మంది మహిళా ఉద్యోగుల పాల్గొన్నారు. జీఎం కార్యాలయసమావేశ మందిరంలో శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏరియా దుర్గం రామచందర్ మహిళా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం మహిళలకు, యువతులకు వారి అర్హతకు తగిన ఉద్యోగ నియమకాలు చేస్తూ వారికి సముచిత స్థానం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో మణుగూరు ఏరియాలో గనులు, డిపార్ట్ మెంట్ల యందు ఉన్న ఖాళీలను గుర్తించి ఆయా స్థానాలలో ఉద్యోగ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఏరియాలో వివిధ విభాలలో గుర్తించబడిన ఖాళీలు: కన్వేయర్ ఆపరేటర్, పంప్ ఆపరేటర్, వాల్వ్ ఆపరేటర్ (సర్ఫేస్), చార్జర్ సేఫ్టీ, ల్యాంప్ రూమ్ ఫిట్టర్, కుక్, కుక్ హెల్పర్, వెండర్, ఆఫీస్ అటెండెంట్, స్వీపర్, సర్వే మజ్దూర్, స్టోర్స్ ఇష్యూ మజ్దూర్, సాంప్లింగ్ మజ్దూర్, ఈపి గ్రీసర్/ హెల్పర్, జనరల్ మజ్దూర్, ఎక్స్‌సివ్ క్యారియర్ మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తూ తమ ప్రతిభతో సమాజంలో దేశంలో ఎంతో గౌరవ ప్రతిష్ట పొందుతున్నారు. మణుగూరు ఏరియాలో పని చేస్తున్న సింగరేణి మహిళా ఉద్యోగులు ఈ ప్రక్రియ కొరకు ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కమిటీ ద్వారా ఎన్నికైన సింగరేణి మహిళా ఉద్యోగులకు పైన పేర్కొన్న ఖాళీల యందు చేరే ముందు ఎంవిటిసి ద్వారా కొత్తపోస్టులకు సంబందించిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళా ఉద్యోగులు సద్వినియోగ పరచుకోవడానికి తగిన అర్హత, ఆసక్తి కలిగి ఉన్న వారు ఉన్నత స్థాయిలో ఎదుగాలని ఆకాంక్షించారు. ఈ కౌన్సిలింగ్ లో పాల్గొన్న మహిళా ఉద్యోగులకు తమకు ఇష్టమైన స్థానంలో పని చేయుటకు వెనువెంటనే తమ ఆమోదాన్ని తెలియపర్చడమైనది. కమిటీ సభ్యులు ఎస్ ఓ టు జిఎం డి. శ్యామ్ సుందర్, డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్వారు, డిజిఎం(ఐఈ) కే. వెంకట్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరి రావు, సీనియర్ పర్సనల్అధికారి సింగూ శ్రీనివాస్, మణుగూరు ఏరియా సింగరేణి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



## కారు, బైక్ ఢీ

### కల్లు గీత కార్మికులకు తీవ్ర గాయాలు



**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** దినసరి చర్యల్లో భాగంగా ఇద్దరు కల్లుగీత కార్మికులు తాటిచెట్లు ఎక్కి కల్లు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నక్రమంలో కారు, వారు ప్రయాణిస్తున్న బైక్ ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ములుగు మండలం జాకారంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు మండలంలోని అబ్బాపూర్ పంచాయతీ పరిధి శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల బాబు, మోటపోతుల భద్రయ్యలు తనైబైక్ పై జాకారం గ్రామానికి వచ్చి తాటిచెట్లు ఎక్కి కల్లు గీశారు. తిరిగి తమ బైక్ పై వెళ్తూ జాకారం మసీదు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా హన్మకొండ వైపు నుంచి ములుగు వైపునకు పెళ్లి కార్డులు పంచేందుకు వస్తున్న వారి ఫోర్డు కారు బైక్ ను ఢీకొట్టింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరినీ హన్మకొండ, అక్కడి నుంచి హైదరాబాద్ కు తరలించారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

**మణుగూరు, నవంబర్ 16, మహా :** మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. జీతాలు రాక కార్మికులు కుటుంబాలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని, మున్సిపాలిటీలో ఉన్నటువంటి కమిషనర్లు మారుతున్నారు తప్ప మున్సిపల్ లో పనిచేస్తున్నటువంటి కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి వారికి న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొడిశాల రాములు, సీఐటీయూ మున్సిపల్ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, రమ, నరసింహారావు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరా డెయిరీ స్థల పరిశీలన



**ముదిగొండ, నవంబర్ 16, మహా:** మండల కేంద్రమైన ముదిగొండలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇందిరా డెయిరీ ప్లాంట్ స్థలాన్ని ఇందిరా క్రాంతి పథకం (ఐకెపి) ఏపీఎం చెరుకూరి కల్పన శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జెడ్పిటిసి మాజీ బుల్లెట్ బాబు, ఐఎన్టీయుసి మండల అధ్యక్షులు ఉసికల రమేష్ నాయకులు మందరపు ఉపేందర్ రావు, కొమ్ము నరసింహారావు, శ్రీనివాస రావు ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ వికాస్ బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన సదస్సు

**సత్తుపల్లి, నవంబర్ 16, మహా:** మండల పరిధిలోని బి. గంగారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ శోభా మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం, ఆటల్ పెన్షన్ యోజన, జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై పలు సూచనలు చేశారు. 1456 రూపాయల బీమాతో రూ. 24 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. ఇటీవల రామానగరం గ్రామంలో (గులాబి) స్వయం సహాయక బృందం సభ్యురాలు దార్ల బేబీ మే నెలలో అనారోగ్య కారణం చేత మరణించగా మృతురాలికి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా ఉండడం వల్ల నామిని కుమారుడు సురేష్ కి రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ లభించిందని ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో సురేష్ కి అందించినట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులందరూ ఇన్సూరెన్స్ తీసుకోవాలన్నారు. ఐ.ఆర్.ఐ.ఎక్స్ ఆపరేషన్ మేనేజర్ రవికుమార్, ఛానల్ మేనేజర్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆ గైడ్ లైన్స్ మార్చండి

### మా ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుంది

### గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం సిటీ , నవంబర్ 16, మహా :** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే తాము ధాన్యం కొనుగోలు చేస్తున్నామని గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే గైడ్ లైన్స్ మార్చండని ఆయన అన్నారు . రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నిలువ చేసేందుకు రాష్ట్రంలోని గిడ్డంగుల సంస్థ గోదాములను సిద్ధం చేశామని రాయల తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్ లో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ మళ్లీ అధికారం కోసం రైతుల ఆత్మస్థైర్యం దెబ్బ తీసే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని రాయల పేర్కొన్నారు. వరి సాగు ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని రాయల నాగేశ్వరరావు తెలిపారు. కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో సన్న రకాలు 25 నుంచి 40 లక్షల ఎకరాలకు పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడమే అందుకు కారణమని అన్నారు. దొడ్డు రకం వరి సాగు 41 లక్షల నుంచి 21 లక్షల ఎకరాలకు పడిపోయిందని ఆయన చెప్పారు. రాష్ట్ర అవసరాలే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం ఉందన్నారు. 7411 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే తాము ధాన్యం కొనాలి.. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే గైడ్ లైన్స్ మార్పించండంటూ ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కామేపల్లి సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యసంపదకు ఊపిరి పోసేనా?

- లక్ష్యసాధనలో అడుగడుగున ఆటంకం
- 60 శాతం మాత్రమే చేప పిల్లల విడుదల
- అదును దాటితే ఆశలు ఆవిరి

**ఖమ్మం జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, మహా:** రాష్ట్రంలో మత్స్య సంపద పెంపుదల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రాజెక్టు గణనీయ పురోగతిని సాధించినప్పటికీ, కొన్ని చోట్ల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ లక్ష్యసాధనకు ఆటంకం ఏర్పడుతోంది. చేప పిల్లల సరఫరాలో సరిగా పర్యవేక్షణ లేకపోవడం, సమయానికి తగిన చర్యలు తీసుకోకపోవడం వంటి సమస్యలు పరిశ్రమపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 90 శాతం చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేసినప్పటికీ అనుకున్న లక్ష్యం మాత్రం ఇంకా చేరుకోలేకపోయారు. ఇప్పటి వరకు జిల్లాకు కేటాయించిన చేప విత్తనాల విషయంలో 57% మాత్రమే లక్ష్యాన్ని సాధించారు. అయితే చేప పిల్లల విడుదలకు అదును దాటిపోతే పరిస్థితి ఏమిటి అని సంఘ సభ్యులు ఆందోళనలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 876 చెరువులలో 2.8 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియను గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతోపాటు, 215 సహకార సంఘాలను 16,000 సభ్యులతో ఏర్పాటు చేయడం ద్వారా బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటివరకు జిల్లాలో 794 ట్యాంకుల్లో చేప విత్తనాల విడుదల పూర్తయినని చెప్పవచ్చు. ప్రభుత్వ లక్ష్యం 2.8 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1.62 కోట్ల చేప పిల్లల మాత్రమే ట్యాంకుల్లో వదిలారు. దీంతో చెరువుల లెక్కల విషయంలో మాత్రం 90.6% పురోగతి సాధించినప్పటికీ, విత్తనాల పంపిణీ విషయంలో మాత్రం 57.9 శాతం మాత్రమే పురోగతి సాధించారు. అంటే ఇంకా 40% మత్స్య విత్తనాలను చెరువుల్లో వదలాల్సి ఉంది. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యం, అధికారుల అలసత్వం వలన ఈ లక్ష్యం పూర్తి కాలేదని క్షేత్ర స్థాయిలో వినిపిస్తుంది. నూరు శాతం లక్ష్యాలను అదును దాటకముందే పూర్తి చేయాలని జిల్లా ఉన్నతాధికారులు, అమాత్యులు చెప్పినప్పటికీ ఆ శాఖ అధికారులు మాత్రం కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావడం లేదని స్పష్టంగా చెప్పవచ్చు. ప్రత్యేకించి చేప పిల్లల సరఫరాను వేగవంతం చేసి, మిగిలిన ట్యాంకుల అభివృద్ధి పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అలా జరగడం లేదు .



### ప్రజల ఆగ్రహం:

గ్రామీణ ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రారంభమైనప్పుడు ప్రభుత్వం పెద్ద ఆశలు చూపినా, వాటిని సాధించడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. నిధుల దుర్వినియోగం, కార్యదీక్షా లోపం వంటి సమస్యలు ప్రాజెక్టును వెనుకకు నెడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి, నిర్లక్ష్యాన్ని తొలగించినప్పుడు మాత్రమే మత్స్య సంపద ప్రాజెక్టు తన అసలైన లక్ష్యాన్ని చేరుకుంటుంది అని సామాన్య ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# క్యాంటీన్ ప్రారంభం




**ఇల్లందు, నవంబర్ 16, మహా :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని హాస్పిటల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన జియం ఆఫీసు క్యాంటీన్ ను శనివారం ఏరియా జియం జాన్ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే ఉద్యోగులకు రుచికరమైన, పౌష్టిక, నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ క్యాంటీన్ ను జియం కార్యాలయ, ఏరియా స్టోర్, ఏరియా వర్క్ షాప్, సీహెచ్పీ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్యాంటీన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావడానికి కృషి చేసిన డిజియం (పర్సనల్) జీవి. మోహన్ రావు, డిజియం సివిల్ రవి కుమార్ లను ప్రత్యేక అభినందించారు. అనంతరం ఏరియా అధికారులు, ఉద్యోగులు జియంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూ జియం బొల్లం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, ఎజియం (ఐఇ) గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డిజియం (పర్సనల్) జీవి. మోహన్ రావు, డిజియం (సివిల్) రవి కుమార్, డిజియం (సర్వే) బాలాజీ నాయుడు, అధికారులు ధనుంజయ రెడ్డి, మధుబాబు, క్రిస్టఫర్, దిలీప్ కుమార్, మహేష్, నాగేశ్వరరావు, గుర్తింపు సంఘ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య, ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



**వైరా, నవంబర్ 16, మహా :** ధాన్యం కొనుగోలు కోసం బియ్యం గింజల కొలతలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైక్రో మెషీన్ పద్ధతిని ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మైక్రో మెషీషన్ లో బియ్యం గింజ పొడవు 6 మిల్లీ మీటర్లు వెడల్పు రెండు మిల్లీ మీటర్లు లోపు మాత్రమే ఉంటే సన్న ధాన్యం క్రింద కొనుగోలు చేయుటకు ప్రభుత్వం విధించిన నిబంధన భవిష్యత్తులో వరి పంట పండించే రైతుకు శాపంగా మారుతుందని, వెంటనే మైక్రో మిషన్ కొలతల పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 32 రకాల ధాన్యాన్ని సన్న ధాన్యంగా గుర్తించి ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలి అని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తేమ తాలు శాతం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు వాతావరణ మార్పులు రైతుల గుండెల్లో రైళ్లు పరుగు పెట్టించే పరిస్థితి ఏర్పడిందన్నారు. అది చాలదు అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం రాశుల్లో నుంచి కొన్ని గింజలు ఏరి బియ్యం చేసి మైక్రో మెషీన్ లో బియ్యం గింజ కొలతలు వేసి అప్పుడు మాత్రమే సన్న ధాన్యం కింద కొనుగోలు చేస్తున్నారు అని అన్నారు. ప్రభుత్వమే సన్న రకాలు గుర్తించిన తర్వాత కొలతలతో పని ఏమిటని రాంబాబు ప్రశ్నించారు. సారవంతమైన భూముల్లో సన్న రకాల ధాన్యం కూడా ఎక్కువ బలంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్న రకాలు, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులను గురి చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు పైడిపల్లి సాంబశివరావు, తోట నాగేశ్వరరావు, వడ్లమూడి మధు, అమరనేని కృష్ణ, రైతులు మేదరమెట్ల పూర్ణయ్య, శ్రీనివాసరావు, నాగరాజు, నాగేశ్వరరావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ యూనియన్ ఇల్లందు ఇన్ చార్జిగా గోచికొండ



**ఇల్లందు, నవంబర్ 16, మహా :** ఐఎన్టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఇల్లందు ఇంచార్జ్ గా గోచికొండ సత్యనారాయణను శనివారం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ నియమించారు. ఈనెల 14న గోదావరి ఖనిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సింగరేణిలో కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికుల హక్కుల సాధన కోసం గత నెల యూనియన్ స్థాపించారు. ఈ సందర్భంగా గోచికొండ సత్యనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అసంఘటిత కార్మిక సంఘం, సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఇల్లందు ఏరియాకు ఇంచార్జ్ గా నియమించినందుకు జనక్ ప్రసాద్, ధర్మపురి లకు కృతజ్ఞతలు తెలిపారు. అసంఘటిత కార్మిక సంఘాన్ని ఇల్లందులో బలోపేతం చేసే విధంగా తన వంతు కృషి చేస్తానని, కార్మికులు ఎలాంటి ఇబ్బంది ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# ఏరియా వైద్యశాలను సందర్శించిన జీఎం



**ఇల్లందు, నవంబర్ 16, మహా :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని సింగరేణి వైద్యశాలను శనివారం ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా హాస్పిటల్ లో అడ్మిట్ అయిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యంపై వారి నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారితో ఆప్యాయంగా మాట్లాడాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందించే వైద్య సేవలలో ఎలాంటి ఇబ్బందులు కలిగిన బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) జివి. మోహన్ రావు, డిప్యూటీ మేనేజర్ మహేష్, ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి పత్రికలు



**నేలకొండపల్లి, నవంబర్ 16 , మహా:** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు నిలుస్తున్నాయని నేలకొండపల్లి వైద్యాధికారి డాక్టర్. కె.రాజేష్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలను సీనియర్ జర్నలిస్టు అత్తులూరి హనుమంతరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ ను వైద్యాధికారి రాజేష్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలను చైతన్యం పరచటంతో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నిజాన్ని నిర్భయంగా ప్రపంచానికి చాటుతూ .. నిస్వార్థంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అన్నారు. జర్నలిస్టుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పోలంపల్లి నాగేశ్వరరావు, అత్తులూరి హనుమంతరావు, పెంటమళ్లకోటయ్య, ఎస్. నరసింహారావు, తుమ్మా ఉపేందర్, దేగల వెంకటేశ్వర్లు, మల్లేల ఉపేందర్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, గొలుసు ఆంజనేయులు, తాతా హనుమంతరావు, దండా శ్రీనివాసరావు, మల్లెబోయిన ఉపేందర్, తేజావత్ గిరి పాల్గొన్నారు.

# రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

### డీఈఈ చింతమల్ల నాగేశ్వరరావు




**నేలకొండపల్లి, నవంబర్ 16, మహా:** విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పొలం బాటను రైతులు వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ డీఈఈ చింతమల్ల నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ఆరెగూడెం లో శనివారం పొలం బాట కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు మోటార్ల వద్ద కెపాసిటి కలిగిన కెపాసిటర్స్ ను వాడాలని సూచించారు. రైతులు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించారు. వంగిన స్తంభాలను సరిచేయటం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను సరిచేయటం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చటం, కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయటం లాంటి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కోక్యానాయక్, రాజేశ్వరపురం ఏఈడీ నారాయణరావు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల కోసం గిరిజనుల ఆందోళన



**అశ్వారావుపేట, నవంబర్ 16, మహా:** అశ్వారావుపేట మండలం ఎర్రగుంటపల్లిలో గిరిజనులు, అటవీశాఖ అధికారులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇళ్లు లేక ఖాళీగా ఉన్న అటవీ భూముల్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్న గిరిజనుల నివాసాలను అధికారులు తొలగించడంపై ఘర్షణ చెలరేగింది. తమకు నిలువనీడ లేక, పరదాలు వేసుకుని అక్కడ నివసిస్తుంటే, వాటిని తొలగించి మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించేవరకు తాత్కాలికంగా అదే ప్రాంతంలో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అధికారుల తీరును నిరసిస్తూ గిరిజనులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పట్టించుకోకపోవడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కులను కాపాడి, ఇళ్లు కేటాయించాలి అని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# గాడిన పడిన సర్వే

- చకచకా పూర్తి చేస్తున్న అధికారులు
- 43 శాతానికి చేరిన జిల్లా సర్వే
- వేంసూర్ లో అత్యధికంగా 64 శాతం
- 30% కు పరిమితమైన ఖమ్మం నగరం
- ఆదాయ మార్గాలు వెల్లడించని ప్రజలు



**ఖమ్మం, నవంబర్ 16, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణ సర్వే గాడినపడిందని చెప్పవచ్చు. ఖమ్మం జిల్లాలో గత ఎనిమిది రోజులుగా సర్వే నిర్వహిస్తున్న అధికారులకు జిల్లా ప్రజలు సహకరిస్తున్నప్పటికీ ఆదాయ మార్గాలు మాత్రం పూర్తి స్థాయిలో వెల్లడించడంలేదు. మొదటి రెండు రోజులు అంతంత మాత్రంగానే సహకరించిన ప్రజలు ప్రస్తుతం అధికారులకు అడిగిన సమాచారం ఇస్తుండడంతో జిల్లాలో సర్వే చకచకా సాగుతుంది. జిల్లాలో సగటున 43శాతానికి చేరుకోగా , జిల్లాలోని వేంసూరు మండలంలో అత్యధికంగా 64% సర్వే పూర్తయింది. ఇక ఖమ్మం నగరంలో మాత్రం 30 శాతానికే పరిమితమైంది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 5,66,486 కుటుంబాలు ఉండగా శనివారం నాటి వరకు రెండు లక్షల 44 వేల 656 కుటుంబాల్లో సర్వే పూర్తి చేశారు. అత్యధికంగా వేంసూరు మండలంలో 15,694 కుటుంబాలు ఉండగా ఇప్పటివరకు పదివేల యాభై ఒక్క కుటుంబాల్లో సర్వే పూర్తి చేశారు. తక్కువగా ముదిగొండలో 7079 కుటుంబాల మాత్రమే సర్వే పూర్తయింది. మండలంలో 20వేల 655 కుటుంబాలు ఉన్నాయి. జిల్లాలోని కామేపల్లి, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కూసుమంచి, సింగరేణి, ఏన్కూర్, కొనిజర్ల, వేంసూర్ మండలాల్లో 50 నుంచి 60 శాతం వరకు సర్వే పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా సర్వే అధికారులకు ప్రజలు ఆదాయ మార్గాలు మాత్రం వెల్లడించడం లేదు. అధికారులు మాత్రం వారు చెప్పింది రాసుకొని సర్వేను కొనసాగిస్తున్నారు.

# దొడ్డు రకం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**నేలకొండపల్లి, నవంబర్ 16, మహా:** దొడ్డు రకం కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలంటూ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు సూచించారు. మండలంలోని అనాసాగారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. నిబంధనలు పాటించి మద్దతు ధరను పొందాలని సూచించారు. కొత్తగా దొడ్డు రకం విక్రయాల కోసం అనాసాగారంలో ప్రత్యేక కేంద్రంను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించి క్వింటాకు రూ.2300 మద్దతు ధరను పొందాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కేంద్రంను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీయం అశోక్రాణి, మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ ఆలస్యం మధుసూదన్ రావు, సీసీ మంగమ్మ, స్వయం కృషి సమాఖ్య ప్రతినిధులు బందెల రూప, సుజాత, అరుణ, ప్రమీలా పాల్గొన్నారు.

# తూకంలో మోసం.. ఆగ్రహించిన అన్నదాత

- ఏన్కూరు వ్యవసాయ మార్కెట్లో వ్యాపారుల అక్రమాలు
- మార్కెట్ కు తాళం వేసిన రైతులు
- నాలుగు గంటల పాటు ఆందోళన
- పోలీసుల రంగ ప్రవేశం
- వ్యాపారులపై ఫిర్యాదు



**ఏన్కూర్, నవంబర్ 16, మహా :** ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ సాక్షిగా అన్నదాత దగా పడుతున్నాడు. అక్రమాలకు అలవాటుపడ్డ వ్యాపారులు ఏకంగా వ్యవసాయ మార్కెట్లోని రైతన్నను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. రైతులు మార్కెట్ కు తీసుకువచ్చిన పత్తిని తూకం వేసే విషయంలో తేడా చూపించి అందని కాడికి దోచుకుంటున్నారు. ఇటు వ్యాపారులు అటు అధికారుల తీరుపై అనుమానం వచ్చిన అన్నదాతలు ఒక్కసారిగా వేబ్రిడ్జిని(కాంటా మిషన్) క్షుణ్ణంగా పరిశీలించడంతో వ్యాపారుల మోసాలు ఒక్కసారిగా బయట పడ్డాయి. దీంతో రైతులు వ్యవసాయ మార్కెట్ కు తాళం వేసి నాలుగు గంటలపాటు ఆందోళన చేపట్టారు. పరిస్థితి చేజారి పోతున్న క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. వ్యాపారాలపై రైతులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఖమ్మం జిల్లా ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్లో జరిగిన ఈ సంఘటన పూర్తి వివరాలు పరిశీలిస్తే... మండల పరిధిలోని గార్ల ఒడ్డు గ్రామానికి చెందిన నరేష్ అనే రైతు వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తిని వ్యాపారస్తుడికి అమ్మాడు. అయితే ఆ వ్యాపారస్తుడు సూచించిన వేబ్రిడ్జి (కాంటా) మిషన్ దగ్గరికి వెళ్లి తూకం వేయించాడు. తూకంలో అనుమానం రావడంతో దగ్గరలోని మరో కాంటా మిషన్ దగ్గర తూకం వేయించాడు. దీంతో 20 కేజీల తేడా వచ్చింది. తూకంలో తేడా రావడంతో ఆగ్రహించిన రైతు మరి కొంతమంది రైతులు కలిసి వ్యవసాయ మార్కెట్ ఎదుట ధర్నా చేశారు. మార్కెట్లో వ్యాపారస్తులు రైతులను మోసం చేస్తున్నారని, వీరిపై మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని, రైతులు ఆగ్రహించారు. పత్తి కొనుగోలు చేసేటప్పుడు ఒక రేటు, దిగుమతి అయిన తర్వాత మరో రేటు అంటూ వ్యాపారస్తులు రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో రైతులు మండల కార్యాలయాల ఎదుట ప్రధాన రోడ్డుపై ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రఫీ సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. సమాచారం తెలుసుకున్న సీఐ ముత్తిలింగం సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సంఘటనపై విచారణ చేశారు. మోసం చేస్తున్న వ్యాపారస్తులపైన, తూకంలో మోసం చేస్తున్న వే బ్రిడ్జి (కాంటా) మిషన్ వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే రైతుల ఫిర్యాదు చేసిన క్రమంలో తూనికల కొలతల శాఖ అధికారులు వ్యవసాయ మార్కెట్ లోకి వచ్చి వేబ్రిడ్జి కాంటాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక్కడ రైతులు చూపించిన వ్యత్యాసానికి, అధికారులు చూపించిన వ్యత్యాసానికి మంత్రాలు లేకుండా ఉండడంతో రైతులు మరింత ఆగ్రహంతో ఉన్నారు.



# అశ్వారావుపేట డివైడర్ వద్ద ప్రమాదం

**అశ్వారావుపేట, నవంబర్ 16, మహా :** అశ్వారావుపేట సెంట్రల్ లైటింగ్ డివైడర్ వద్ద శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి రాజమండ్రి వెళ్తున్న అశోక్ లేలాండ్ ట్రాలీ వాహనం ప్రమాద సూచికలు లేకపోవడంతో నిర్మాణంలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ మచిగిరి నూకరాజు ఛాతికి స్టీరింగ్ తగిలి గాయపడి, తీవ్ర నొప్పితో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ప్రమాదాన్ని గుర్తించిన కాంట్రాక్టర్ డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడి, నష్టం భర్తీ కోసం వాహన పత్రాలు బలవంతంగా లాక్కొన్నాడు. డ్రైవర్ యూనియన్ పెద్దలను ఆశ్రయించి న్యాయం కోరాడు. ప్రమాద సూచికలు లేకపోవడం వల్ల డివైడర్ వద్ద ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతుండడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. కాంట్రాక్టర్ దురుసు ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు.

# 24న మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష

### జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖర శర్మ

**ఖమ్మం, నవంబర్ 16, మహా :** 2024-25 విద్యా సంవత్సరానికి గాను జరుగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష ఈ నెల 24న ఉదయం 930 నుండి మధ్యాహ్నం 1230 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖర శర్మ శనివారం తెలిపారు. విద్యార్థులు తమ పరీక్షా హాల్ టికెట్లను సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి పేర్కొన్నారు.

# స్వింగ్ ఆర్మ్ మౌంటెడ్ మోటార్‌తో ఎలక్ట్రిక్ హోండా యాక్టీవా.. 27న ఆవిష్కరణ..!



ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హోండా మోటార్ సైకిల్స్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) త్వరలో ఆవిష్కరించనున్న ఎలక్ట్రిక్ స్కూటర్ టీజర్ విడుదల చేసింది. స్విమ్ ఆర్మ్ మౌంటెడ్ యూనిట్‌గా కనిపిస్తుంది. అత్యధికంగా ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్లు మిడ్ డ్రైవ్ పర్మినెంట్ మ్యాగ్నటిక్ సింక్రోనస్ (పీఎంఎస్) మోటార్ వాడతారు. పలు ఈస్కూటర్లలో బీఎల్డీసీ హబ్స్, స్వింగ్ ఆర్మ్ మౌంటెడ్ మోటార్లు వాడతారు. బజాజ్ చేతక్ ఈవీ, హీరో మోటో కార్ప్ వారి విదా వీ1 వంటి స్కూటర్లలో స్వింగ్ ఆర్మ్ మౌంటెడ్ స్కూటర్లు ఉన్నాయి. బజాజ్ ఆటో, హీరో మోటో కార్ప్ దారిలోనే హోండా పయనిస్తోంది. హోండా యాక్టీవా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను మార్కెట్లోకి తెస్తున్నది. ఈవీ స్కూటర్ తయారీలో సంక్లిష్టతను, విద్యుత్ బదిలీ నష్టాన్ని స్వింగ్ ఆర్మ్ మౌంటెడ్ మోటార్ తగ్గించేస్తుంది. అందుకోసం బెల్ట్ డ్రైవ్ లేదా చైన్ డ్రైవ్ పీఎంఎస్ మోటార్ తో వస్తుందీ హోండా యాక్టీవా ఎలక్ట్రిక్ స్కూటర్. నూతన ఎలక్ట్రిక్ స్కూటర్ యాక్టీవాకు ఎల్ ఈడీ హెడ్ ల్యాంప్ తోపాటు డిజిటల్ కన్సోల్, బ్లూటూత్ కనెక్టివిటీ, నేవిగేషన్ తదితర ఫీచర్లు ఉంటాయి. వీటితోపాటు కనెక్టెడ్ టెక్ వయా ప్యాక్స్ అందిస్తోంది హోండా మోటార్ సైకిల్స్ అండ్ స్కూటర్స్.

కర్ణాటకలోని నర్సాపురాలో డెడికేటెడ్ ఈవీ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తామని గతేడాదే ప్రకటించింది హోండా మోటార్ సైకిల్స్. ఈ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్‌లో 2030 నాటికి పది లక్షల యూనిట్లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. స్వాప్ స్వాపబుల్ బ్యాటరీ అండ్ ఫిక్స్డ్ బ్యాటరీ పవర్డ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల ప్లాట్ ఫామ్ పై ఎలక్ట్రిక్ యాక్టీవా రూపుదిద్దుకుంటున్నది. హోండా మోటార్ సైకిల్ తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ ఫిక్స్డ్ బ్యాటరీతో వస్తుందని భావిస్తున్నారు. హోండా మొబైల్ పవర్ ప్యాక్ ఈ ఆధ్వర్యంలో స్వాపబుల్ బ్యాటరీ ఆప్షన్‌తో మరిన్ని కమర్షియల్ అప్లికేషన్స్ సిద్ధం చేయాలని హోండా యోచిస్తున్నది.ఈ నెల 27న హోండా మోటార్ సైకిల్స్ తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ ఆవిష్కరించడానికి రంగం సిద్ధం చేస్తున్నది. మిగతా ఎలక్ట్రిక్ స్కూటర్లతో పోలిస్తే హోండా ఎలక్ట్రిక్ యాక్టీవా ధర ఆకర్షణీయంగా ఉంటుందని భావిస్తున్నారు.

## సింగరేణి రికార్డు లాభాలు



**మహా, హైదరాబాద్:** సింగరేణి సంస్థ లాభాల్లో దూసుకెళుతున్నది. అద్భుతమైన ప్రదర్శనను కనబరుస్తూ ఈ ఏడాది మొదటి అర్థభాగంలోనే అధనంగా వెయ్యికోట్లకు పైగా లాభాలు గడించినట్లు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్యకాలానికిగాను పన్ను చెల్లింపులకు ముందు రూ. 4 వేల కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించినట్టు పేర్కొన్నారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,932 కోట్లతో పోలిస్తే 36 శాతం అధికమని చెప్పారు. అలాగే గడిచిన ఆరు నెలల్లో బొగ్గు అమ్మకాల ద్వారా రూ.17,152 కోట్లు, విద్యుత్తు విక్రయాల ద్వారా రూ.2,286 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

## దిద్దుబాటు దిశగా మార్కెట్లు

### ఆల్‌టైమ్ హై నుంచి 10 శాతానికిపైగా క్షీణించిన దేశీయ ఈక్విటీలు



**న్యూఢిల్లీ, నవంబర్ 15:** ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లు ఎన్నో కొత్త రికార్డులను నెలకొల్పాయి. అటు బాంబే స్టాక్ ఎక్సేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్సేంజ్ (ఎన్ఎస్ఈ) రెండూ ఆల్‌టైమ్ హైలతో అదరగొట్టాయి. అయితే ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. గతకొద్ది రోజులుగా సూచీలు వరుస నష్టాలకే పరిమితమవుతున్నాయి మరి. ఈ క్రమంలోనే సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిల నుంచి గమనిస్తే.. సెన్సెక్స్, నిఫ్టీలు 10 శాతానికిపైగా పడిపోయాయి. మరికొద్ది రోజులూ దిద్దుబాటు దిశగానే ఈక్విటీ మార్కెట్లు పయనించవచ్చన్న అంచనాలున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో చైనా ఉద్దీపనలతో విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుపోతుండటం కూడా ఉన్నది. గత నెలలోనే రూ.94,000 కోట్లు తరలిపోయాయి. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటిస్తున్న నిరాశాజనక ఆర్థిక ఫలితాలూ కారణమే. అంతేగాక మదుపరుల లాభాల స్వీకరణ, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతుండటం కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై 85,978.25 పాయింట్లను చేరింది. తొలిసారి నిఫ్టీ కూడా 26,277.35 పాయింట్లను తాకింది. అయితే అక్టోబర్ నుంచి మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మొదలైంది. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హై స్థాయి నుంచి చూస్తే ప్రస్తుతం సెన్సెక్స్ 8,397.94 పాయింట్లు లేదా 9.76 శాతం కోల్పోయింది. నిఫ్టీ సైతం 2,744.65 పాయింట్లు లేదా 10.44 శాతం పడిపోయింది.

# మార్కెట్లో కవాసాకి జడ్ హెచ్2.. జడ్ హెచ్2 ఎస్ఈ బైక్స్ ఆవిష్కరణ..

## రూ.24.18 లక్షల నుంచి షురూ..!



ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ కవాసాకీ ఇండియా భారత్ మార్కెట్లోకి 2025 జడ్ హెచ్2 (2025 Z H2), జడ్ హెచ్2 ఎస్ఈ (Z H2 SE) మోటారు సైకిళ్లను ఆవిష్కరించింది. 2025 జడ్ హెచ్2 (2025 Z H2) మోటారు సైకిల్ రూ.24.18 లక్షలు (ఎక్స్ షోరూమ్), జడ్ హెచ్2 ఎస్ఈ (Z H2 SE) మోటారు సైకిల్ రూ.28.59 లక్షలు పలుకుతుంది. రెండు మోటారు సైకిళ్లు ఒకేలా ఉన్నా, జడ్ హెచ్2 ఎస్ఈ (Z H2 SE) మోటారు సైకిల్‌లో మరింత ప్రీమియం హార్డ్ వేర్ ఉంటుంది. మెటాలిక్ మ్యాట్టె గ్రాఫెన్ స్టీల్ గ్రే లేదా మిర్రర్ కోటెడ్ బ్లాక్, స్టాండర్డ్ మోడల్ ఎమరాల్డ్ బ్లేజ్డ్ గ్రీన్ లేదా మెటాలిక్ మ్యాట్టె గ్రాఫీన్ స్టీల్ గ్రే లేదా మెటాలిక్ డియాబ్లో బ్లాక్ మెషిన్ 2025 పవర్ ఫుల్ సూపర్ చార్జ్‌డ్ జడ్ హెచ్2 ఎస్ఈ (Z H2 SE) లభిస్తుంది. రెండు మోటారు సైకిళ్లు 998సీసీ, ఇన్ లైన్ ఫోర్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ కలిగి ఉంటాయి. గరిష్టంగా 11,000 ఆర్పీఎం వద్ద 197.2 బీహెచ్పీ విద్యుత్, 8,500 ఆర్పీఎం వద్ద 137 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. స్లిప్, అసిస్ట్ క్లచ్ తోపాటు 6స్పీడ్ గేర్ బాక్స్ ఉంటాయి. బ్రేకింగ్ సెటప్‌లో ట్విన్ 320ఎంఎం ఫ్రంట్ డిస్క్స్, సింగిల్ 260ఎంఎం రోటర్ ఉంటాయి. జడ్ హెచ్2 మోటారు సైకిల్‌లో నిసిన్ మాస్టర్ సిలిండర్ తోపాటు బ్రెంబో ఎం 4.32 మోనోబ్లాక్ కాలిపర్, జడ్ హెచ్2 ఎస్ఈ మోటార్ సైకిల్ లో హైస్పెక్ బ్రెంబో స్టైలెమా మోనో బ్లాక్ కాలిపర్, బ్రెంబో ఫ్రంట్ మాస్టర్ సిలిండర్ కలిగి ఉంటాయి.

## దేశం-విదేశం | NATIONAL NEWS

# మండల పూజ కోసం తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం




**మహా, పాతానమిట్టె:** శబరిమల అయ్యప్పకు చెందిన మండల పూజా సీజన్ ప్రారంభమైంది. ఇవాళ అయ్యప్ప ఆలయాన్ని తెరిచారు. వేల సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి ఆలయ ద్వారాలను తెరిచారు. తలుపులు తీయగానే.. శరణం అయ్యప్ప అంటూ శబరిమల ఊగిపోయింది. శుక్రవారం నుంచే సన్నిధానంకు భక్తుల రాక మొదలైంది. వర్చువల్ క్యూ విధానం ద్వారా శనివారం 70 వేల మంది భక్తులు బుకింగ్ చేసుకున్నారు. స్పాట్ బుకింగ్‌ల ద్వారా మరో 10 వేల మంది బుక్ చేసుకునే అవకాశం ఉన్నది. అయ్యప్ప స్వామి ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు మూసివేయనున్నారు. ఆ తర్వాత రాత్రి 11 గంటల వరకు దర్శనం ఉంటుంది. ప్రతి రోజు నెయ్యి అభిషేకం తెల్లవారుజామున 3.30 నిమిషాలకు ప్రారంభం అవుతుంది. ఉదయం 7.30 నిమిషాలకు ఉషా పూజ ఉంటుంది. మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఉచ్ఛ పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నిమిషాలకు దీపారాధాన ఉంటుంది. రాత్రి 9.30 నిమిషాలకు అతజాపూజ నిర్వహిస్తారు. భారీ సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో దర్శన సమయాన్ని రోజుకు 18 గంటలకు పెంచారు. మండల పూజ సీజన్ సందర్భంగా తొలి రెండు వారాల పాటు వర్చువల్ క్యూ బుకింగ్ ఫుల్ అయ్యింది. 14 రోజుల వరకు బుకింగ్ ఖాళీ లేదు. నవంబర్ 30వ తేదీ కోసం ఆరు వేల స్లాట్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ప్రతి రోజు వర్చువల్ క్యూ బుకింగ్ ద్వారా 70 వేల మంది దర్శనం చేసుకోనున్నారు. పంపా, ఎరుమేలి, సాత్రం వద్ద స్పాట్ బుకింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పంపా స్పాట్ బుకింగ్ సెంటర్ వద్ద భారీగా జనం ఉన్నట్లు తెలుస్తోంది.




# హైవేపై కలకలం..

## సూట్‌కేస్‌లో మహిళ మృతదేహం

**మహా, లక్నో:** హైవేపై కలకలం చెలరేగింది. రోడ్డు పక్కన రెడ్ సూట్‌కేస్ కనిపించింది. తెరిచి చూసిన కొందరు అందులో మహిళ మృతదేహం ఉండటం చూసి షాక్ అయ్యారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం ఉదయం ఢిల్లీలక్నో హైవే పక్కన వదిలేసిన ఎర్రటి సూట్‌కేస్‌ను కొందరు గమనించారు. దానిని తెరిచి చూడగా అందులో కుక్కి ఉన్న మహిళ మృతదేహం కనిపించింది. దీంతో వారు షాక్ అయ్యారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని సూట్‌కేస్ నుంచి బయటకు తీసి పరిశీలించారు. ఆమె శరీరంపై గాయాలున్నట్లు తెలిపారు. మహిళ వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు చెప్పారు. ఆధారాల సేకరణ కోసం ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించారు. మహిళ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూట్‌కేస్ ఎవరు వదిలేశారో అన్నది తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

# మణిపూర్ సీఎం ఇంటిపై దాడి..

## సీఎం బీరెన్ సింగ్ సురక్షితం అన్న అధికారులు..!



**మహా, మణిపూర్:** మణిపూర్ రాజధాని ఇంపాల్ లోని సీఎం ఎన్ బీరెన్ సింగ్ వ్యక్తిగత నివాసంపై శనివారం దుండగులు దాడికి ప్రయత్నించారు. దీంతో సీఎం ఇంటి బయట ఉన్న దుండగులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఘటనా సమయంలో సీఎం బీరెన్ సింగ్.. తన ఇంట్లో లేరని అధికార వర్గాలు తెలిపాయి. ఆఫీసులో సురక్షితంగా ఉన్నారని అధికార వర్గాల కథనం. సీఎం బీరెన్ సింగ్ ఇంటిపై దాడి నేపథ్యంలో మణిపూర్ ప్రభుత్వం ఇంపాల్ లో కర్ఫ్యూ విధించింది. ఏడు జిల్లాల పరిధిలో ఇంటర్నెట్ సేవలు తాత్కాలికంగా నిలిపేసింది. జిరిబామ్ జిల్లా పరిధిలో ముగ్గురు వ్యక్తుల హత్యకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనకారులు నిరసనలకు దిగారు. ఇంపాల్ లోని ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎంఎల్ఏల నివాసాల వద్ద కూడా ఆందోళనకారులు నిరసన తెలిపారు. 24 గంటల్లో హంతకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంపాల్ వెస్ట్ జిల్లాలోని సాగోల్ బండ్ ప్రాంతంలోని సీఎం బీరెన్ సింగ్ అల్లుడు - బీజేపీ ఎమ్మెల్యే ఆర్ కే ఇమో ఇంటి ముందు ధర్నా చేశారు. రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సపమ్ రంజన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎల్ సుసుంద్రో సింగ్ నివాసాలను లక్ష్యంగా చేసుకుని ఆందోళనకారులు దాడులకు దిగారు.


# కశ్మీర్‌లో కురుస్తున్న మంచు..

## రెట్టింపైన అందాలు..



**మహా, కశ్మీర్:** జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో మంచు కురుస్తున్నది. కుప్వారా జిల్లాలోని మాచిల్ సెక్టార్ లో, బందిపొరా జిల్లాలోని అప్పర్ రీచెస్ లో, గురెజ్, తులైల్, కంజల్వాన్ లలోని సరిహద్దు ఏరియాల్లో భారీగా మంచు కురుస్తున్నది. దాంతో కశ్మీర్ అందాలు మరింత రెట్టింపయ్యాయి. లోయలు, కొండలపైన తెల్లటి మంచు కురుస్తున్నది. చల్లని మంచు తెంపరులు కురుస్తూ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. బందిపొరా జిల్లాలోని పలు ప్రాంతాల్లో తెల్లటి మంచు దుప్పటి కప్పుకోవడంతో కశ్మీర్ అందాలు రెట్టింపయ్యాయి. కశ్మీర్ అందాలకు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు..

# అంతర్జాతీయ సరిహద్దు వద్ద 16 డ్రోన్లు స్వాధీనం



**మహా, చండీఘడ్:** పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద సుమారు 16 డ్రోన్లను బోర్డర్ సెక్యూర్టీ దళాలు స్వాధీనం చేసుకున్నాయి. గడిచిన వారం రోజుల నుంచి ఆ డ్రోన్లను సీజ్ చేశారు. దీనికి తోడు 16 కిలోల మత్తుపదార్థాలను కూడా బీఎస్ఎఫ్ దళాలు పట్టుకున్నాయి. ఆ స్మగ్లింగ్ కేసులో ఇద్దర్ని అరెస్టు చేశారు. నవంబర్ 9 నుంచి 15వ తేదీ వరకు 16 డ్రోన్లను కూల్చివేసినట్లు అధికారులు చెప్పారు. గతంలో ఓ వారంలో అత్యధికంగా 10 డ్రోన్లను సీజ్ చేసేవాళ్లమని, కానీ ఇప్పుడు ఆ సంఖ్య పెరిగినట్లు బీఎస్ఎఫ్ అధికారి తెలిపారు. అమృత్‌సర్, తార్న్ తరన్, గురుదాస్‌పూర్ సెక్టార్లలో ఆ డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 216 డ్రోన్లను రికవరీ చేశారు. అయితే 2023లో మొత్తం 107 డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ భూభాగం నుంచి ఎగురుతున్న ఆ డ్రోన్లతో నార్కోటిక్ పదార్థాలు, ఆయుధాలు, నకిలీ కరెన్సీ సరఫరా చేస్తున్నారు.

# శాంసన్, తిలక్ శతకాల మోత

## రికార్డు స్కోర్ కొట్టిన టీమిండియా



సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లను ఊచకోత కోసిన భారత కుర్రాళ్లు మళ్లీ విజృంభించారు. సిరీస్ విజేతను నిర్ణయించే నాలుగో టీ20లో పంజా విసిరారు. గత మ్యాచ్ సెంచరీ హీరో తిలక్ వర్మ(120 నాటౌట్), ఓపెనర్ సంజూ శాంసన్(109 నాటౌట్)లు ఆకాశమే హద్దుగా ఆడారు. ఈ ఇద్దరూ దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపించేశారు. శాంసన్, తిలక్ వర్మల విధ్వంసంతో సఫారీ ఫీల్డర్లు చేష్టలుడిగిపోగా టీమిండియా వరుసగా రెండో మ్యాచ్‌లో రెండొందలపైనే కొట్టింది. ఈ ఇద్దరూ సెంచరీలతో గర్జించగా సూర్యకుమార్ సేన సఫారీలపై రికార్డు స్కోర్ బాదింది. గత మ్యాచ్‌లో 220 పరుగుల ఛేదనలో చివరిదాకా పోరాడి ఓడిన మర్క్‌రమ్ బృందం ఈ కొండంత లక్ష్యాన్ని కరిగించడం కష్టమే.

జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో భారత టాపార్డర్ బ్యాటర్లు శివాలెత్తిపోయారు. ఆడుతున్నది భారత పిచ్‌ల మీదే అన్నట్టు బౌండరీల మీద బౌండరీలు బాదేశారు. డేంజరస్ ఓపెనర్ సంజూ శాంసన్ (109 నాటౌట్) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడగా.. యువకెరటం తిలక్ వర్మ(120 నాటౌట్) భీకర ఫామ్ కొనసాగించాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ(36) జట్టు స్కోర్ 73 పరుగుల వద్ద ఔట్ అయ్యాక.. క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ ఎడాపెడా బౌండరీలతో అలరించాడు. అటువైపు శాంసన్ సైతం తగ్గకపోవడంతో 9 ఓవర్లకే భారత జట్టు స్కోర్ 100 దాటింది. ఆకాసేపటికే స్టబ్స్ బౌలింగ్‌లో సిక్సర్ బాదిన శాంసన్ యాభై పూర్తి చేసుకున్నాడు.

# ఎలైట్ గ్రూప్‌లో స్టార్ క్రికెటర్లు..




**మెగా వేలం ప్రత్యేకతలు ఇవే..!**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలం అంటే చాలు ఫ్రాంచైజీలతో పాటు అభిమానుల్లో ఎక్కడ లేని ఆసక్తి ఉంటుంది. వేలంలో ఏ ఫ్రాంచైజీ ఎవరిని కొంటుంది? రికార్డు ధర పలికేది ఎవరు? .. అనే ప్రశ్నలు ప్రతిఒక్కరి బుర్రలో తిరుగుతాయి. ఇక మెగా వేలం గురించి అయితే చెప్పనక్కర్లేదు. ఎందుకంటే.. ప్రతి ఫ్రాంచైజీకి కొత్త స్క్వాడ్‌ను ఎంపిక చేసుకొనే సువర్ణావకాశం ఇది. 18వ సీజన్ కోసం నవంబర్ 24, 25వ తేదీల్లో జెడ్డా వేదికగా మెగా వేలం జరుగనుంది. కాబట్టి ప్రతిభావంతులైన క్రికెటర్లను కొనేందుకు ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్ నిర్వాహకులు వేలం గురించి ఆసక్తికర విషయం వెల్లడించారు. ఐపీఎల్ మెగా వేలాన్ని మరింత ఇంట్రెస్టింగ్‌గా మార్చేందుకు స్టార్ ఆటగాళ్లను రెండు గ్రూప్‌లుగా విభజించనున్నారు. రూ.2 కోట్ల కనీస ధరకు పేరు రిజిస్టర్ చేసుకున్న వాళ్లలో కొందరిని ఎలైట్ గ్రూప్ సభ్యులుగా పేర్కొంటూ.. వాళ్లను రెండు వర్గాలుగా విభజించి వేలం జరపాలనేది నిర్వాహకుల ఆలోచన. ఇదే విషయాన్ని వాళ్లు 10 ఫ్రాంచైజీల యజమానులకు తెలియజేశారు. అయితే.. ఏ గ్రూప్‌లో ఎంతమంది ఉంటారు? అనేది మాత్రం చెప్పలేదు. వేలానికొచ్చే ప్రముఖ క్రికెటర్లను గ్రూప్‌లుగా చేయడం ఇదే మొదటిసారి కాదు. 2014లో, ఆపై 2018లో ఇలానే రెండు వర్గాలుగా చేసి వేలం నిర్వహించారు. అయితే.. 2022 మినీ వేలంలో మాత్రం ఒకే గ్రూప్‌గా వేలం పాట పూర్తి చేశారు.

### ఎలైట్ గ్రూప్‌లో ఎవరంటే..?

నవంబర్ 24, 25వ తేదీల్లో జరుగబోయే ఐపీఎల్ మెగా వేలంలో ఎలైట్ గ్రూప్ సభ్యులు మొదట అమ్ముడుపోయే వీలుంది. ఇంతకూ ఈ గ్రూప్‌లో ఉండేది ఎవరంటే.. రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, షమీ, అర్ష్‌దీప్ సింగ్, అశ్విన్, మిచెల్ స్టార్క్, జోస్ బట్లర్.. తదితరులు ఉండే అవకాశముంది. ఈసారి వేలంలో 1,578 క్రికెటర్లు పేర్లు నమోదు చేసుకున్నారు. వీళ్లలో క్యాప్డ్ భారత క్రికెటర్లు 48 మంది, అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు 272 మంది ఉండగా.. అనుబంధ దేశాల నుంచి 30 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.




## రాకెట్ వదిలేసిన ఆసియా క్రీడల విజేత..

# సుదీర్ఘ కెరీర్ సాగిందిలా..!

ఆసియా క్రీడల విజేత ప్రజ్నేష్ గున్నేశ్వరన్ టెన్నిస్‌కు వీడ్కోలు పలికాడు. ప్రొఫెషనల్ టెన్నిస్ నుంచి వైదొలుగుతున్నట్టు శుక్రవారం ప్రజ్నేష్ వెల్లడించాడు. 35 ఏండ్ల వయసులో ఆటకు అల్విదా చెప్పస్తున్నానని ప్రజ్నేష్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తెలిపాడు. సుదీర్ఘ కెరీర్‌కు గుడ్ బై చెప్పేసిన ప్రజ్నేష్‌కు టెన్నిస్ దిగ్గాలు లియాండర్ పేస్, మహేశ్ భూపతిలు అభినందనలు తెలియజేశారు. రెండేండ్ల క్రితం ఆసియా క్రీడల్లో అదరగొట్టిన ఇతడు కాంస్య పతకం సాధించాడు. దాంతో, సింగిల్స్‌లో అత్యుత్తమంగా 75వ ర్యాంకుకు చేరుకున్నాడు. 'మాండేలి టు మెల్‌బోర్న్' అనే టైటిల్‌తో తన రిటైర్మెంట్ వార్తను అభిమానులతో పంచుకున్న ప్రజ్నేష్ ఏమేం రాసుకొచ్చాడంటే..?



# సినిమా వార్తలు MOVIE NEWS





# నాగ చైతన్యతో మరోసారి జత కట్టనున్న బుట్టబొమ్మ..!

స్టార్ హీరో అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గతేడాది కస్టడీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చైతూ భారీ డిజాస్టర్‌ను అందుకున్నాడు. ఇక ప్రస్తుతం అతడి ఆశలన్ని తండేల్ చిత్రంపైనే ఉన్నాయి. కార్తికేయ 2 ఫేం చందూ మొండేటి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి కథానాయికగా నటిస్తుండగా.. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా అనంతరం నాగ చైతన్య విరుపాక్ష దర్శకుడితో ఒక సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. సాయి ధరమ్ తేజ్‌కి విరుపాక్ష లాంటి బ్లాక్ బస్టర్‌ను అందించిన దర్శకుడు కార్తీక్ వర్మ దర్శకత్వంలో చైతూ ఓ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ చేయబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో కథానాయికగా పూజా హెగ్డేను తీసుకోనున్నారని టాక్ నడుస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే దాదాపు 10 ఏండ్ల తర్వాత వీరిద్దరి మళ్లి కలిసి నటించనున్నారు. ఇంతకుముందు వీరిద్దరు కలిసి 'ఒక లైలా కోసం' అనే సినిమా చేశారు. 2014లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి హిట్ అందుకుంది.



# మలయాళ దర్శకుడితో

ప్రస్తుతం 'హిట్ 3' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు నాని. ఈ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెల సినిమా ఉంటుంది. ఆ తర్వాత సుజిత్ సినిమా. ఇలా క్షణం తీరిక లేకుండా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు నాని. ఇంత బిజీలో కూడా ఆయన మరో దర్శకుడి కథకు ఓకే చెప్పినట్టు ఫిల్మ్ వర్గాల సమాచారం. ఆ దర్శకుడి పేరు విపిన్ దాస్.మలయాళంలో 'జయ జయ జయ హే', 'గురువాయూర్ అంబలనడయిల్' చిత్రాలతో మంచి విజయాలను అందుకున్న దర్శకుడు తను. తాజాగా ఆయన చెప్పిన కథ.. నానికి బాగా నచ్చడంతో ఆ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తున్నది. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ సినిమాను నిర్మించనున్నట్టు సమాచారం. 2026లో ఈ సినిమాను సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది.






# పుష్ప 2కి డబ్బింగ్ పూర్తి చేసుకున్న ఫహద్ ఫజిల్

మలయాళ నటుడు ఫహద్ ఫజిల్ పుష్ప 2 సినిమాకి డబ్బింగ్ కంప్లీట్ చేశాడు. తన పాత్రకు డబ్బింగ్ పూర్తయినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఫహద్ ఫజిల్ ఈ సినిమాలో ఎస్పీ భన్వర్ సింగ్ షెకావత్ అనే ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. మొదటి పార్ట్‌లో కొద్దిసేపు మాత్రమే కనిపించిన ఈ పాత్ర రెండో పార్ట్‌లో అయిన కాస్తా ఎక్కువగా ఉంటుందని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. అయితే రెండో పార్ట్‌కు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేశాడు ఫహద్ ఫజిల్.అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా నటిస్తున్న ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ధనుంజయ్, రావు రమేష్, సునీల్, అనసూయ భరద్వాజ్ & అజయ్ ఘోష్ శ్రీలీల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# అందంగా నవ్వాలి.. హద్దులు చెరిపేయాలి..

'పుష్ప 2'లో ఐటమ్ సాంగ్‌కి శ్రీలీల 5కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నదని ఫిల్మ్ వర్గాల్లో టాక్. ఆమె డ్యాన్సింగ్ టాలెంట్‌కి అదేం పెద్ద ఎక్కువ కాదని శ్రీలీల అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే.. 'ది వైల్డ్ చైల్డ్' పేరుతో శ్రీలీల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోషూట్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతున్నది. ఇది కేవలం ముఖ హావభావాలకు సంబంధించిన ఫొటోషూట్ కావడం విశేషం. ఈ ఫొటోషూట్‌లో శ్రీలీల తన అందమైన కళ్లను, అంతకంటే అందమైన తన నవ్వునూ ఎలియేట్ చేస్తూ తెగ సందడి చేసింది. 'అందంగా నవ్వాలి.. హద్దులు చెరిపేయాలి.. వాలుగా చూడాలి.. కవ్వింతగా కనుసైగ చేయాలి..' ఇలా కొటేషన్స్ ఇస్తూ.. దానికి తగ్గట్టు క్లోజ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో శ్రీలీల కనిపించిన తీరుకు అభిమానులు ఫిదా అయిపోతున్నారు. ఇక శ్రీలీల సినిమాల విషయానికొస్తే.. ఆమె ఐటమ్ నంబర్ చేసిన 'పుష్ప 2' వచ్చే నెల 5న విడుదల కానుంది. అదే నెల 25న క్రిస్మస్ కానుకగా నితిన్ 'రాబిన్‌హుడ్'తో ప్రేక్షకులను పలకరించనుంది శ్రీలీల. ఇక రవితేజ 'మాస్ జాతర' ఎలాగూ ఉంది. పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో కూడా శ్రీలీలే వన్ ఆఫ్ ది హీరోయిన్. వీటితోపాటు తమిళ్‌లో కూడా ఓ సినిమా చేస్తున్నదని సమాచారం.

